Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 25.04.2014, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 47 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

- నూరుసీట్లు దాటడం ఖాయమంటున్న సర్వేలు
- ఓటుబ్యాంకులుగా మారిన కొన్ని మతాలు, కులాలు
- బీజేపీతో పొత్తు కలిసిరాని సైకిల్
- ఫలించని బి.సి కార్డు ప్రయోగం

**రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడబోయే తొలి ప్రభుత్వం ఏ పార్టీదనేదానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సీమాంధ్రలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల అవకాశం రెండే రెండు పార్టీలకు ఉంది. మొదటిది వైయస్సార్ కాంగ్రెస్ లేదంటే తెలుగుదేశం.**

కాంగ్రెస్‌పార్టీ ఇక ఈ రాష్ట్రంలో పదేళ్ల దాకా కోలుకోలేకపోవచ్చు. ఎందుకంటే ఆ పార్టీ మీద ప్రజలకు ఏర్పడిన కోపం అలాంటిది. ఖచ్చితంగా ఇంకో పదేళ్లు ఆ కసి కాంగ్రెస్‌పార్టీని వెంటాడుతూనే ఉంటుంది. ఇక రెండు బలమైన ప్రాంతీయ పార్టీలున్న చోట స్వతహాగానే జాతీయ పార్టీలు మనుగడ సాగించలేవు. తమిళనాడు, పశ్చిమబెంగాల్, బీహార్ వంటి రాష్ట్రాలలో జరిగిందిదే! సీమాంధ్రలోని 175శాసన సభా స్థానాలకు 25లోక్‌సభ స్థానాలకు కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులను నిలిపినప్పటికి ఒక్క లోక్‌సభను కాని, గట్టిగా 5 అసెంబ్లీలను గాని ఆ పార్టీ గెలుస్తుందన్న గ్యారంటీ లేదు.

ఇప్పుడు జరుగుతున్న అధికార పోరాటం వైయస్సార్ కాంగ్రెస్, తెలుగుదేశంపార్టీల మధ్యనే! రాష్ట్ర విభజన అంశం నేటి సార్వత్రిక ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కాంగ్రెస్‌పార్టీ సిడబ్ల్యూసిలో విభజన నిర్ణయం తీసుకున్నాక (మిగతా 10వ పేజీలో)



# తు'ఫ్యాన్' ధాటికి 'దేశం' విలవిల



## పవర్ ముద్దు... జూనియర్ వద్దు!

- చంద్రబాబు తీరుపై తెలుగుతమ్ముళ్ళ రుసరుస...

**తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు వ్యవహరిస్తున్న తీరు ఉన్న పళ్లను ఊడ గొట్టుకుని కట్టుడుపళ్ల కోసం పాకులాడినట్లుగా ఉంది. నిన్న టిక్కెట్ల విషయంలో అలాగే వ్యవహరించారు. ఇప్పుడు ప్రచారం విషయంలోనూ అదే పంథాన పోతున్నారు. ఆయన వ్యవహారం తెలుగుతమ్ముళ్ళకే నచ్చడం లేదు. పార్టీలో వున్న సినీగ్లామర్‌ను వదిలేసి పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ కోసం ఆయన పరుగులు తీయడంపై తెలుగుదేశం కార్యకర్తలు ఆగ్రహం చెందుతున్నారు.**

టిక్కెట్ల విషయంలో చంద్రబాబు ఎక్కువుగా కాంగ్రెస్ నుంచి వలసవచ్చిన వారిపైనే ఆధారపడ్డారు. లోక్‌సభ, అసెంబ్లీ టిక్కెట్ల కేటాయింపులో వారికే పెద్దపీట వేసాడు. ఈ నేపథ్యంలో ఎన్నో ఏళ్లుగా పార్టీని నమ్ముకుని పని చేస్తున్న వారికి మొండిచేయి చూపాడు.

ఇప్పుడు ఎన్నికల ప్రచారంలో కూడా అదే ధోరణి అవలంభిస్తున్నాడు. నందమూరి కుటుంబంలో ఇప్పుడు సినీ గ్లామర్ ఎవరికన్నా వుందంటే అది ఒక్క జూనియర్ ఎన్టీఆర్‌కే! స్వర్గీయ నందమూరి తారకరామారావు తరహాలో హావభావాలు ప్రదర్శిస్తూ ఉపన్యసించగలిగేది కూడా జూనియరే! నందమూరి కుటుంబంలో బాలకృష్ణ, హరికృష్ణల క్రేజ్ తగ్గి (మిగతా 10వ పేజీలో)



## తెలంగాణలో హంగ్... మిగతా పార్టీలే కింగ్స్

**ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత దేశంలో 29వ రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణలో ఏ ప్రభుత్వం ఏర్పడబోతుంది. కోట్లాదిమంది తెలుగుప్రజల మనోభావాలను తుంగలో తొక్కి, సీమాంధ్ర ప్రజలకు తీరని ద్రోహం చేస్తూ ఏకపక్షంగా తెలంగాణ ఏర్పాటు చేసిన కాంగ్రెస్‌పార్టీనా? లేక 13ఏళ్లుగా ప్రత్యేకరాష్ట్రం కోసం పోరాటంచేసిన తెలంగాణ రాష్ట్రసమితినా? తెలంగాణలో తొలిజెండా ఎగురవేయడానికి ఈ రెండు పార్టీల నాయకులు కూడా తెగ ఉబలాటపడుతున్నారు.**

తెలంగాణ ఇచ్చిన పార్టీగా కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటుంటే, తెలంగాణను తెచ్చిన పార్టీగా టీఆర్ఎస్ ఊదరగొడుతుంది. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం కాంగ్రెస్‌లో టీఆర్ఎస్ విలీనమై ఉంటే తెలంగాణ ప్రభుత్వం కాంగ్రెస్‌దే! కాని టీఆర్ఎస్ విలీనం కాకపోవడంతో కాంగ్రెస్‌కు ప్రధానపోటీ టీఆర్ఎస్ నుండే ఎదురవుతుంది. ప్రాథమిక అంచనాలను బట్టి తెలంగాణలో అటు కాంగ్రెస్‌కు గాని ఇటు టీఆర్ఎస్‌కు గాని పూర్తి స్థాయి మెజార్టీ వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. ప్రభుత్వం ఏర్పాటుకు 60అసెంబ్లీలు గెలవాలి. కాంగ్రెస్‌కు గాని టీఆర్ఎస్‌కు గాని 50 సీట్లకు మించేటట్లు లేవు. తెలుగుదేశం, (మిగతా 10వ పేజీలో)




## ప్రేతాత్మను... బంధిస్తారా?



(వివరాలు 10వ పేజీలో)

## 'శోభ'ను కోల్పోయిన కర్నూలు



(వివరాలు 10వ పేజీలో)

# అదే జనం... తరగని అభిమానం!



## • జిల్లాలో జగన్ రోడ్‌షో అదిరింది

*క్రేజ్ ఉన్న ఓ సినీహీరో మొదటిసారి ఓ ప్రాంతానికి వస్తే జనం తండోపతండాలుగా ఎగబడతారు. అదే హీరో రెండోసారి వస్తే చూడ్డానికి వచ్చే జనం కొంత తగ్గుతారు. మూడోసారి వస్తే బాగా పలచబడతారు. నాలుగోసారి వస్తే ఆయన సభకు లారీలు, బస్సులు పెట్టి జనాన్ని తోలాల్సి ఉంటుంది. కాని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఎన్నిసార్లు నెల్లూరుజిల్లా పర్యటనకు వచ్చినా చూడడానికి వస్తున్న జనం తగ్గడం లేదు. వారిలో అభిమానమూ తగ్గడం లేదు.*

ఎన్నికల ప్రచారంలో భాగంగా శని, ఆదివారాలలో జిల్లాలోని పలు ప్రాంతాలలో జగన్ నిర్వహించిన రోడ్‌షోలు అదిరాయి. ఎక్కడ చూసినా జనం... జనం... ప్రభంజనంలా వుండింది. శనివారం సాయంత్రం కడప జిల్లా చిట్వేలు నుండి ఘాట్‌రోడ్డులో నెల్లూరుజిల్లాలోకి ప్రవేశించారాయన. రాపూరు సమీపంలో జిల్లా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. శనివారం రాపూరు, ఆత్మకూరులలో జరిగిన జనభేరి సభలలో ఆయన ప్రసంగించారు. ఈ రెండుచోట్లా ఇసుకేస్తే రాలనంతగా జనం హాజరయ్యారు. రాపూరులో సభ ముగిసిన అనంతరం డేగపూడి, పొదలకూరు, తాటిపర్తి, మహ్మదాపురం, సంగం, వాసిలి మీదుగా రోడ్‌షో నిర్వహిస్తూ ఆత్మకూరు చేరుకున్నారు. నెల్లూరుపాలెం సెంటర్ వద్ద భారీగా మోహరించిన వైయస్సార్ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. నెల్లూరుపాలెం సెంటర్ నుండి పంచాయితీబస్టాండ్ వరకు నాలుగుకిలోమీటర్ల దూరం రోడ్‌షో సాగింది. దారిపొడవునా ప్రజలు, మహిళలు, వృద్ధులు, పిల్లలు పూలుచల్లి జగన్‌కు ఆహ్వానం పలికారు. శనివారం రాత్రి ఆత్మకూరులో బసచేసిన జగన్ ఆదివారం రాజోలు, చంద్రపడియ గ్రామాల మీదుగా రోడ్‌షో నిర్వహిస్తూ వింజమూరుకు చేరుకున్నారు. స్థానిక చెన్నకేశవస్వామి దేవస్థానం వద్ద నుండి ర్యాలీ మొదలైంది. పంచాయితీ బస్టాండ్ వరకు జరిగిన రోడ్‌షోతో వింజమూరు ప్రధానరహదారి జనసంద్రాన్ని తలపించింది. ఇక్కడ జరిగిన జనభేరి సభలో జగన్ ప్రసంగించారు. వింజమూరు నుండి బయలుదేరి నందిగుంట, దుత్తలూరు, వరి కుంటపాడుల మీదుగా రోడ్‌షో నిర్వహిస్తూ ప్రకాశంజిల్లాలోకి ప్రవేశించారు. జగన్ ఈసారి తన ప్రసంగంలో వై.యస్. చేపట్టిన పథకాలను ప్రస్తావించడమేకాక, వైకాపా అధికారంలోకి వస్తే చేయబోయే పనులను కూడా వివరించారు. ముఖ్యంగా స్థానిక అంశాలను ప్రస్థావించి ప్రజలలో స్పందన కలిగేలా చేసారు. సోమశిల ఉత్తర కాలువ గురించి మాట్లాడారు. దానిని పూర్తిచేసి లక్ష ఎకరాల ఆయకట్టుకు నీళ్లందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతిచోట ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రజలకు సూచిస్తూ వారిని గెలిపించాలని కోరారు. జగన్ వెంట ఈ కార్యక్రమాలలో వైసిపి జిల్లా కన్వీనర్ మేరిగ మురళీ, ఎంపీ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, అసెంబ్లీ అభ్యర్థులు కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, మేకపాటి గౌతమ్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## వైకాపా, తెదేపా... హుషార్
## కాంగ్రెస్ బేజార్



ఎన్నికల వేళ ముంచుకొస్తుంది. గట్టిగా మరో పదిరోజుల్లో సార్వత్రిక ఎన్నికలు మన ముందుంటాయి. జిల్లాలోని నెల్లూరు, తిరుపతి లోక్‌సభలతో పాటూ 10అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల ప్రచారం జోరుమీదుంది. అయితే ఇక్కడ చెప్పుకోదగిన విషయమేమిటంటే వైయస్సార్ కాంగ్రెస్, తెలుగుదేశంపార్టీలు గెలుపు కోసం హోరాహోరీ పోరాడుతుండగా కాంగ్రెస్‌పార్టీ మాత్రం నామమాత్రపు పోరాటాన్నిస్తుండడం! ఆనం కుటుంబ సభ్యులు పోటీ చేసిన మూడు నియోజకవర్గాలలో తప్పితే మిగతా 7అసెంబ్లీలో కాంగ్రెస్ అభ్యర్థులు కనీసం గట్టిపోటీ ఇచ్చే పరిస్థితుల్లో కూడా లేరు. నెల్లూరు నగరంలో ఏ.సి.సుబ్బారెడ్డి, నెల్లూరు రూరల్‌లో ఆనం విజయకుమార్‌రెడ్డి, ఆత్మకూరులో ఆనం రామనారాయణరెడ్డిలు మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థులుగా గట్టి ముక్కోణపు పోటీలో వున్నారు. తర్వాత వెంకటగిరిలో నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, గూడూరులో పనబాక కృష్ణయ్య అంతోఇంతో పోటీ ఇవ్వగలుగుతున్నారు. సర్వేపల్లి, కోవూరు, కావలి, ఉదయగిరి, సూళ్లూరుపేటలలో కాంగ్రెస్‌పార్టీ పరిస్థితి అధ్వాన్నంగా మారుతోంది. గతంలో ఎన్నడూ లేనంత తక్కువుగా కాంగ్రెస్‌కు ఓట్లు రాబోతున్నాయి.

దీనికి భిన్నంగా వైయస్సార్ కాంగ్రెస్, తెలుగుదేశం అభ్యర్థులు మాత్రం ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రచారపర్వంలో వైకాపా అభ్యర్థులు అందరికంటే ముందున్నారు. ఎన్నికల షెడ్యూల్ నెలక్రితమే వచ్చింది. కాని జగన్ తన ఎన్నికల షెడ్యూల్‌ను ఏడాది క్రితమే విడుదల చేసాడు. జిల్లాలో నెల్లూరు పార్లమెంటుకు, 10అసెంబ్లీలకు ముందుగానే సమన్వయకర్తలను ప్రకటించాడు. వారిని ఈ ఏడాదికాలంగా దీవెన, ఆశీస్సులు, ప్రజాదీవెన, ప్రజా అక్షింతలు వంటి పేర్లతో ప్రజల మధ్య తిరిగేలా చేసాడు. ఒకరు ప్రజాప్రస్థానం అంటూ మరొకరు మరో ప్రస్థానమంటూ రకరకాల పేర్లతో పార్టీ కార్యక్రమాలు నిర్వహించారు. ఇలా తిరిగిన సమన్వయకర్తలనే జగన్ అభ్యర్థులుగా ప్రకటించాడు. ఇది వైకాపా అభ్యర్థులకు బాగా కలిసొచ్చే అంశం. ప్రచారంలో వైకాపాకు ధీటుగా ఏ పార్టీ ముందుకు పోలేకపోతుంది.

సీట్లు వస్తాయోరావో తెలియక తెలుగుదేశంపార్టీ అభ్యర్థులు ఎక్కువ నియోజకవర్గాలలో ముందునుండీ తిరగలేకపోయారు. కావలిలో బీద మస్తాన్‌రావు, ఉదయగిరిలో బొల్లినేని రామారావు, వెంకటగిరిలో కురుగొండ్ల రామకృష్ణ, ఆత్మకూరులో గూటూరు కన్నబాబులు మాత్రమే ముందు నుండి తిరుగుతున్నారు. నెల్లూరురూరల్ సీటు చివరలో బీజేపీకివ్వడంతో ఇక్కడ ఆలస్యంగా ప్రచారాన్ని మొదలుపెట్టాల్సి వచ్చింది. నెల్లూరు నగరం సీటును కాంగ్రెస్‌కు రాజీనామాచేసి వచ్చిన ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డికిచ్చారు. అయితే ఆయన అంతకుముందు నుండే ఎమ్మెల్యేగా ప్రజలమధ్య తిరుగుతున్నాడు కాబట్టి పెద్ద సమస్యలేదు. గూడూరులో జోత్స్నకు ఆఖరున సీటిచ్చారు. దాంతో చాలా ఆలస్యంగా అక్కడ ప్రచారం మొదలైంది. నెల్లూరురూరల్ సీటు మీద ఆశలు పెట్టుకున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చాలాకాలంగా సర్వేపల్లి నియోజకవర్గానికి దూరమయ్యాడు. అయితే చివరకు ఆయనకు సర్వేపల్లినే ఇవ్వడంతో ఇప్పుడు కొత్తగా ప్రచారాన్ని మొదలుపెట్టాల్సి వచ్చింది. సూళ్లూరుపేటలో సిట్టింగ్ ఎమ్మెల్యే పరసారత్నంనే పెట్టినప్పటికి ఆయన పట్ల కొంత వ్యతిరేకత వుంది. అదీగాక ప్రచారంలో కూడా వెనుకబడి వున్నాడు. తెలుగుదేశం అభ్యర్థులు ప్రచారాన్ని ఉధృతం చేస్తేగాని వైకాపా స్పీడ్‌ను అందుకోలేరు.



## 'బల్లి'కే మొండిచేయి...
## ఇలా ఎందుకోయి?

జిల్లా నుండి తెలుగుదేశంపార్టీ సిటింగ్ ఎమ్మెల్యేలలో బల్లి దుర్గాప్రసాద్ ఒక్కడికే చంద్రబాబు మొండిచేయి చూపించడం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో సిటింగ్ ఎమ్మెల్యేలుగా వున్న బీద మస్తాన్‌రావు(కావలి), కురుగొండ్ల రామకృష్ణ(వెంకటగిరి), పరసారత్నం(సూళ్లూరుపేట)లకు సీట్లు దక్కాయి. చంద్రబాబుకు మొదటి నుండి నమ్మినబంటుగా వున్న బల్లి దుర్గాప్రసాద్ చివరి నిముషంలోనైనా తనకే సీటు వస్తుందని బలంగా నమ్మారు. వాస్తవంగా చూస్తే గూడూరు నియోజకవర్గంలో బల్లి దుర్గాప్రసాద్ పట్ల అంత వ్యతిరేకత కూడా లేదు. స్థానికంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉంటాడనే పేరు కూడా వుంది. ఎస్సీ రిజర్వుడ్ ఎమ్మెల్యే అయినప్పటికి సొంతంగా కొంత కేడర్ వుంది. అయినా బల్లికి సీటు ఎందుకు ఎగ్గొట్టారనేది చర్చగా మారింది. డాక్టర్ జ్యోత్స్నకు సీటిచ్చారు. సూళ్లూరుపేటకు చెందిన కాంట్రాక్టర్ గంగాప్రసాద్ ప్రోద్భలంతోనే బల్లికి సీటు దక్కనట్లు తెలుస్తుంది.

చంద్రబాబు గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి సీట్ల బాధ్యతను గంగాప్రసాద్‌కు అప్పగించారు. సూళ్లూరుపేట, వెంకటగిరిలు మాత్రం సిటింగ్ ఎమ్మెల్యేలకే దక్కాయి. గూడూరు సీటునే బల్లికి కాకుండా జ్యోత్స్నకు ఇచ్చారు.

ఇప్పటికే పలుమార్లు ఎమ్మెల్యేగాచేసిన బల్లి దుర్గాప్రసాద్ అయితే ఎవరి చేతుల్లోనూ కీలుబొమ్మగా ఉండే పరిస్థితి లేదు. రాజకీయంగా బాగా రాటుదేలివున్నాడు. కాని ఆర్థికంగా మాత్రం ఈ కాంట్రాక్టర్ కొంత ఖర్చును భరించకతప్పదు. కాబట్టే తమ మాటకు విలువ ఉంటుందనుకుని బల్లికి కాకుండా జ్యోత్స్నకు టిక్కెట్ ఇప్పించుకున్నట్లు తెలుస్తుంది.



## ఆశలు రేపి...
## ఆవిరి చేసి!

రాజకీయాలలో వండర్స్, బ్లెండర్స్ కామన్. నెల్లూరురూరల్ నియోజకవర్గం విషయంలో ఇలాంటివే జరిగాయి. ఈ సీటును బీజేపీకిచ్చి చంద్రబాబు బ్లండర్ మిస్టేక్ చేసాడనుకుంటున్న తరుణంలో వండర్ చోటుచేసుకుంటుందని తెలుగుదేశం నాయకులు ఎదురుచూసారు. కాని అటువంటివేవీ చోటుచేసుకోకుండానే నామినేషన్ల ఘట్టం ముగిసిపోయింది.

నెల్లూరురూరల్ సీటు బీజేపీకి ఇవ్వడంపై తెలుగుతమ్ముళ్లు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ సీటును అనవసరంగా వదులుకున్నామనే ఆవేదనకు గురయ్యారు. ముఖ్యంగా వైకాపాలో ఇమడలేని నాయకులు, కార్యకర్తలు ఇక్కడ తెలుగుదేశం అభ్యర్థి కోసం ఎదురుచూసారు. బీజేపీకి సీటు రావడంతో వారికేమీ పాలుపోలేదు. అయితే నామినేషన్ల గడువు 19వ తేదీ ముగుస్తుందనగా 17, 18తేదీలలో చోటుచేసుకున్న పరిణామాలు రూరల్‌లోని తెలుగు కార్యకర్తలలో మళ్ళీ ఆశలు రేకెత్తించేలా చేసాయి. బీజేపీతో పొత్తుపై చంద్రబాబు వివాదాస్పద ప్రకటనలు చేసాడు. దీంతో టీడీపీ-బీజేపీల మధ్య పొత్తు తెగుతుందనే ప్రచారం వచ్చింది. ఈ నేపథ్యంలో నెల్లూరురూరల్ నుండి నందమూరి హరికృష్ణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డిల పేర్లు తెరమీదకొచ్చాయి. సర్వేపల్లి నుండి పోటీచేయాలా లేక నెల్లూరురూరల్‌కు పోవాలా అనేదానిపై సోమిరెడ్డి కూడా తర్జనభర్జన పడ్డారు. రూరల్‌కు తెలుగుదేశం అభ్యర్థి వస్తున్నాడని ఆ పార్టీ కార్యకర్తలు తెగ సంతోషించారు. అయితే వారి ఆనందం ఎంతోసేపు నిలవలేదు. చంద్రబాబుతో బీజేపీ నేతలు చర్చలు సాగించి వివాదాన్ని పరిష్కరించడంతో రూరల్ తమ్ముళ్లు ఉసూరుమంటూ నీరసపడ్డారు.





## తేదీలు తెలిసాయి

మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికల ఫలితాల కోసం వేలసంఖ్యలో అభ్యర్థులు, లక్షల సంఖ్యలో కార్యకర్తలు, కోట్ల సంఖ్యలో ప్రజలు ఎదురుచూస్తున్నారు. షెడ్యూల్ ప్రకారమైతే ఇదివరకెప్పుడో కౌంటింగ్ జరిగిపోయి ఫలితాలొచ్చి పాలకవర్గాలు కూడా ఏర్పాటైపోయి ఉండాలి. గెలిచినోళ్లు సంబరాలు చేసుకునేవాళ్లు, ఓడినోళ్లు ఈసరికి మామూలు స్థితికి వచ్చేవాళ్లు. కాని స్థానిక ఎన్నికల ఫలితాలు సార్వత్రిక ఎన్నికలపై ప్రభావం చూపుతాయని కొందరు కోర్టులో పిటిషన్ వేయడం, సార్వత్రిక ఎన్నికల తర్వాతే స్థానిక సంస్థల కౌంటింగ్ నిర్వహించాలని సుప్రీంకోర్టు తీర్పునివ్వడం జరిగింది. దీంతో మున్సిపాల్టీల ఈవిఎంలను, పంచాయితీరాజ్ ఎన్నికల బ్యాలెట్ బాక్సులను అధికారులు స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్రపరచి గట్టి బందోబస్తును ఏర్పాటు చేసారు.

కాగా రాష్ట్ర ఎన్నికల సంఘం మున్సిపల్, పంచాయితీ కౌంటింగ్‌కు తేదీలు ఖరారు చేసింది. మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ మే 12న, జడ్పీటీసీ, ఎంపీటీసీల కౌంటింగ్ మే 13న ఉంటుంది. ఈమేరకు అధికార యంత్రాంగం కౌంటింగ్ ఏర్పాట్లకు సమాయత్తమవుతుంది.

# నెల్లూరులో 'ఆప్కాబ్'ను పెట్టాలి

**- మెట్టుకూరు**



రాష్ట్ర విభజన జరిగింది కాబట్టి ఆంధ్రప్రదేశ్‌కు కొత్తగా ఏర్పాటు చేసే ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రధాన కార్యాలయాన్ని నెల్లూరులోనే నిర్మించాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి డిమాండ్ చేసారు. బుధవారం నెల్లూరులోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆప్కాబ్‌కు అపారమైన ఆస్తులున్నాయని, నెల్లూరులో ఆప్కాబ్ ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటుచేయడానికి అన్ని వసతులు ఉన్నాయని అన్నారు. నెల్లూరులో అప్కాబ్ ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేయడం కోసం సీమాంధ్రలోని 13జిల్లాల డీసీసీబీ ఛైర్మెన్‌లను ఒకేతాటి మీదకు తెచ్చి, వారిని ఒప్పిస్తానన్నారు. ఆప్కాబ్ జంటిల్‌మెన్ అగ్రిమెంట్ ప్రకారం మూలధనం సీమాంధ్రకు 58శాతం, తెలంగాణకు 42శాతం, షేర్‌క్యాపిటల్ సీమాంధ్రకు 65శాతం, తెలంగాణకు 35శాతం ఉందని ఇదే దామాషాలో ఆస్థులు, అప్పులను రెండు రాష్ట్రాలకు పంచాలన్నారు. బుక్‌వాల్యూ ప్రకారం పంపకాలు జరిగితే సీమాంధ్ర నష్టపోవడం ఖాయమన్నారు.

## తండ్రి కోసం కూతురు...
## మామ కోసం మేనల్లుడు...





నెల్లూరు నగర 'జైసమైక్యాంధ్ర' పార్టీ అభ్యర్థి ఆనం జయకుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన కుమార్తె శార్వరీ, మేనల్లుడు సాయిశరవణ్‌రెడ్డిలు ఈ నెల 23వ తేదీన రాయాజీవీధి, తిప్పరాజువారివీధి, కర్నాలవీధి, దండువారివీధి, కోటమిట్ట తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి అభ్యర్థించారు. తెలుగుజాతి ఐక్యత కోసం తన అన్నలను కూడా ఎదిరించి సమైక్యాంధ్ర ఉద్యమంలో పోరాడిన ఆనం జయకుమార్‌రెడ్డిని గెలిపించాలని వారు ఓటర్లను కోరారు.

## ముగిసిన బడిబాట...
# ఇక 50రోజులు ఆట పాట

### పిల్లలకు వేసవి సెలవులు



దాదాపు పదినెలలుగా పుస్తకాలతో బాక్సింగ్ చేసిన విద్యార్థులకు ఆటవిడుపు దొరికింది. పబ్లిక్ పరీక్షలు పూర్తికావడంతో ఈ నెల 24వ తేదీ నుండి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. జూన్ 12వ తేదీన తిరిగి విద్యాసంస్థలు తెరచుకోనున్నాయి. బుధవారం చివరి పరీక్ష రాయగానే ఆనందంతో కేరింతలు కొడుతూ విద్యార్థులు తరగతి గదుల నుండి బయటకు వచ్చారు. ఈ వేసవి సెలవులను ఎలా ఎంజాయ్ చేయాలనే దానిపై కుటుంబసభ్యులతో కలిసి ప్లాన్ చేసుకుంటున్నారు. కుటుంబసభ్యులతో కలిసి విహారయాత్రలకు వెళ్లడంతో పాటు స్పెషల్ కోచింగ్స్‌పై దృష్టి సారిస్తున్నారు.

## ముగిసిన నామినేషన్ల తంతు
# ఇక మిగిలింది ఓటర్ల వంతు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నామినేషన్లు వేయడం, పరిశీలించడం, ఉపసంహరించుకోవడం వంటి ప్రక్రియ ముగిసింది. జిల్లాలో నెల్లూరు లోక్‌సభకు, తిరుపతి లోక్‌సభకు, పది అసెంబ్లీ స్థానాలకు మొత్తం 225నామినేషన్లు దాఖలు కాగా, వాటిలో రిటర్నింగ్ అధికారులు 25నామినేషన్లను తిరస్కరించారు. మరో 33మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. కాగా బరిలో 167మంది అభ్యర్థులు నిలిచారు. నెల్లూరు లోక్‌సభ నుండి 14మంది, తిరుపతి లోక్‌సభ నుండి 14మంది, నెల్లూరు నగరం అసెంబ్లీ నుండి 19 మంది, నెల్లూరురూరల్ నుండి 16మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఉదయగిరి నుండి 15మంది, కావలి నుండి 15మంది, ఆత్మకూరు నుండి 8మంది, కోవూరు నుండి 12మంది అభ్యర్థులు రంగంలో వున్నారు. సర్వేపల్లి బరిలో 12మంది, గూడూరులో 14మంది, సూళ్లూరుపేటలో 12మంది, వెంకటగిరిలో 16మంది అభ్యర్థులు రంగంలో వున్నారు. అన్ని నియోజకవర్గాలలో కాంగ్రెస్, తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలతో పాటు జైసమైక్యాంధ్ర, సీపీఎం, సీపీఐ, బీజేపీ, ఆమ్‌ఆద్మీ పార్టీ, పిరమిడ్ ఆఫ్ ఇండియా వంటి పార్టీలే కాక స్వతంత్ర అభ్యర్థులుగా కూడా కొందరు రంగంలో ఉన్నారు.

# సకుటుంబ సపరివారంగా...

**వర్గ రాజకీయాలకే కాదు కుటుంబ రాజకీయాలకు కూడా పెట్టింది పేరు నెల్లూరు. ఇక్కడ ఎన్నికలు వస్తే మూడు కుటుంబాలు, పదిసీట్లు అన్నట్లుగా పరిస్థితి ఉంటుంది. ఒకప్పుడు బెజవాడ, ఆనం, ఆ తర్వాత నల్లపరెడ్డి, నేదురుమల్లి... తాజాగా ఆనం, మేకపాటి, మాగుంట, పనబాక... ఇదే కుటుంబ రాజకీయ పరిణామ క్రమం.**



















ఎన్నికలు జరిగిన ప్రతిసారి కూడా ఒక్కో కుటుంబం నుండి ఇద్దరేసి, లేదంటే ముగ్గురు కూడా బరిలోకి దిగివున్నారు. చరిత్రను పరిశీలిస్తే బెజవాడ రామచంద్రారెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, బెజవాడ పాపిరెడ్డిలు ఒక కాలంలో రాజకీయాలు చేసారు. ఏ.సి.సుబ్బారెడ్డి, ఆనం వెంకటరెడ్డి ఒకేసారి ఎన్నికల్లో పోటీచేసి వున్నారు.

1983 నుండి కూడా జిల్లా రాజకీయాల కుటుంబాల హవా మొదలైంది. ఆ ఎన్నికల్లో ఆనం కుటుంబం నుండి తెలుగుదేశం సీట్లు ఇద్దరికి దక్కాయి. ఆనం వెంకటరెడ్డి ఆత్మకూరు నుండి ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరు నుండి పోటీ చేసారు. 1985లో వెంకటగిరి నుండి నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కోవూరు నుండి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డిలు పోటీ చేసారు. 1989లో నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలుగుదేశం అభ్యర్థిగా, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ చేసారు. 1999 ఎన్నికల్లో ఆనం వివేకానందరెడ్డి నెల్లూరు నుండి ఆనం రామనారాయణరెడ్డి రాపూరు నుండి కాంగ్రెస్ అభ్యర్థులుగా నిలబడ్డారు. అలాగే నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి నరసారావుపేట లోక్‌సభకు, నేదురుమల్లి రాజ్యలక్ష్మి వెంకటగిరి అసెంబ్లీకి పోటీ చేసారు. 2004 ఎన్నికలలోనూ ఆనం సోదరులు అవే స్థానాల నుండి పోటీ చేయగా రాజ్యలక్ష్మి వెంకటగిరి నుండి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి విశాఖ పార్లమెంట్ నుండి పోటీకి దిగారు. మేకపాటి రాజమోహన్‌రెడ్డి నరసారావుపేట లోక్‌సభకు, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఉదయగిరి అసెంబ్లీ బరిలో నిలిచారు. అలాగే మాగుంట శ్రీనివాసులురెడ్డి ఒంగోలు లోక్‌సభకు, మాగుంట పార్వతమ్మ కావలి అసెంబ్లీకి పోటీ చేయడం జరిగింది. 2009ఎన్నికల్లోనూ కుటుంబాల సీట్లు పెరిగాయి. కాంగ్రెస్ నుండి ఆనంకు రెండు సీట్లు, మేకపాటికి రెండుసీట్లు, పనబాక దంపతులకు రెండుసీట్లు దక్కాయి. నేదురుమల్లి కుటుంబంలో రాజ్యలక్ష్మి వెంకటగిరి నుండే పోటీ చేయగా జనార్ధన్‌రెడ్డికి రాజ్యసభ సభ్యత్వం దక్కింది.

టిక్కెట్ల విషయంలో ఫ్యామిలీ ప్యాకేజీ తెలుగుదేశంలో కంటే కాంగ్రెస్‌లోనే ఎక్కువుగా అమలు జరుగుతూ వచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలలోనూ ఫ్యామిలీ ప్యాకేజీలు బాగానే వున్నాయి. ఆనం కుటుంబంలో ముగ్గురికి కాంగ్రెస్ టిక్కెట్లు దక్కాయి. ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు, ఆనం విజయకుమార్‌రెడ్డి నెల్లూరురూరల్, ఆనం చెంచుసుబ్బారెడ్డి నెల్లూరు నగరం నుండి కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ చేస్తుండగా, ఇదే కుటుంబానికి చెందిన ఆనం జయకుమార్‌రెడ్డి జైసమైక్యాంధ్ర పార్టీ అభ్యర్థిగా నెల్లూరు నగరం నుండి పోటీ చేస్తున్నారు. ఇక కేంద్రమంత్రి పనబాక లక్ష్మి బాపట్ల లోక్‌సభ నుండి పోటీ చేస్తుండగా ఆమె భర్త పనబాక కృష్ణయ్య గూడూరు అసెంబ్లీ బరిలో వున్నారు.

ఎన్నికల్లో ఆనంకు ధీటైన టిక్కెట్ల ప్యాకేజీ సాధించింది మేకపాటి కుటుంబమే. కాంగ్రెస్ టిక్కెట్లను ఈసారి అడిగేవాళ్లే లేరు కాబట్టి ఆనం కుటుంబానికి మూడు సీట్లు రావడం గొప్పేమీ కాదు. కాని మహేష్‌బాబు కొత్తసినిమాకు తొలిఆట టిక్కెట్ల కంటే ఎక్కువ డిమాండ్ వున్న వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ టిక్కెట్లను మేకపాటి కుటుంబం మూడింటిని దక్కించుకోవడం వారి గొప్పతనమే. 2009 ఎన్నికల్లో మేకపాటి రాజమోహన్‌రెడ్డి నెల్లూరు లోక్‌సభ, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఉదయగిరి అసెంబ్లీలకు కాంగ్రెస్ టిక్కెట్లు దక్కించుకున్నారు. ఇప్పుడు వైకాపానుండి వారిద్దరితోపాటు ఆత్మకూరు టిక్కెట్‌ను మేకపాటి గౌతంరెడ్డి సాధించుకోవడం విశేషం.

# ఖర్చులు ఖచ్చితంగా చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, పక్కన ఎస్పీ నవదీప్‌సింగ్

ఎన్నికలలో పోటీచేయు అభ్యర్థులు ప్రచారానికి సంబంధించిన ఖర్చులను రిజిష్టరులో తప్పకుండా చూపాలని జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ పేర్కొన్నారు.

బుధవారం నెల్లూరు గోల్డెన్ జూబ్లీ హాల్‌లో నెల్లూరు పార్లమెంట్ పార్టీల అభ్యర్థులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలలో పోటీలో ఉన్న అభ్యర్థులు పత్రికల ద్వారా మరియు ఛానల్స్ ద్వారా ప్రచారం చేయు నిమిత్తము ముందుగా ఎండి మరియు ఎంసి నుండి అనుమతి తీసుకోవాలన్నారు. అలాగే వాహనాలు వాడకంపై కూడా సంబంధిత రిటర్నింగ్ అధికారి నుండి పర్మిషన్ పొందాలన్నారు. దరఖాస్తులో ఎన్ని వాహనాలు చూపారో అన్ని వాహనాలు మాత్రమే ప్రచారంలో వాడాలన్నారు. ఒక నియోజకవర్గంలో అభ్యర్థులు వేరొక నియోజకవర్గంలోకి వాహనాలు వాడకూడదన్నారు. అభ్యర్థులు తమ ఖర్చులను వారి ఖాతాల నుండి మాత్రమే ఖర్చుచేయాలన్నారు. ఓటర్లకు ఫోటో ఓటర్ల స్లిప్పులను అనుమతిస్తారన్నారు. ఆ స్లిప్పులను చూపించి ఓటువేయవచ్చన్నారు. పబ్లిక్ స్థలాల్లో బోర్డులు, హోర్డింగ్‌లు, పోస్టర్లు అంటించకూడదన్నారు. ప్రచారానికి సంబంధించినవి పెట్టాలంటే ముందస్తుగా అనుమతి పొందాలన్నారు. ఎన్నికల నిబంధనలననుసరించి ప్రచారం నిర్వహించాలన్నారు.

నెల్లూరు పార్లమెంట్ జనరల్ అబ్జర్వర్ కాలేంద్ర మోచారి మాట్లాడుతూ ఎన్నికలు నిబంధనల ప్రకారము శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా సజావుగా జరిగేలా చూడాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఈ సమావేశంలో జిల్లా ఎస్పి నవదీప్‌సింగ్, అదనపు జాయింట్ కలెక్టర్ ఆర్ఎస్ రాజ్‌కుమార్, డిఆర్ఓ ఎస్.వి. నాగేశ్వరరావు, వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు పాల్గొన్నారు.

# మే1 పరశురామ జయంతి



నెల్లూరు బ్రాహ్మణ మహాసభ ఆధ్వర్యంలో మే1వ తేదీ గురువారం సాయంత్రం 6గంటలకు ట్రంకురోడ్డులోని టివియస్ కల్యాణసదన్‌లో పరుశురామ జయంతి ఘనంగా జరుగుతుందని, ఈ సందర్భంగా వేదసంస్కృత కళాశాల తెలుగురీడర్ డాక్టర్ కప్పర గిరిజ పరుశురాముని అవతారం ప్రాశస్త్యం గురించి ప్రసంగిస్తారని, కావున నెల్లూరు నగర ప్రజలు పై కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని నెల్లూరు బ్రాహ్మణమహాసభ నాయకులు రాళ్ళపల్లి రామసుబ్బారావు, డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తదితరులు ఒక ప్రకటనలో కోరారు.




## సంతోషకర సంఘటన

జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగంను సస్పెండ్ చేయడం సంతోషించాల్సిన విషయం. ఇప్పుడు కూడా గవర్నర్ పాలన ఉండబట్టి ఆయనను సస్పెండ్ చేసారు గాని, రాజకీయ పాలన ఉండుంటే ఆయన పైరవీచేసి సస్పెండ్ కాకుండా చూసుకునే వాడు. రామలింగం మీద ఎన్నో వివాదాలున్నాయి. మరెన్నో ఆరోపణలున్నాయి. రాజకీయ పలుకుబడితోనే ఆయన ఇంతకాలం ఈ జిల్లాలో ఉండగలిగారు.

ఓ ఉపాధ్యాయురాలు.

## అంతరిస్తున్న జీవరాశి

అశోక చక్రవర్తి కాలం నుండి అహింసా విధానంతో ప్రాణికోటి బ్రతికి బయటపడ్డది. చీమ నుండి ఏనుగు వరకు అన్ని ప్రాణులు స్వేచ్ఛగా జీవించేవి. విదేశీయుల పాలనలో కూడా ప్రకృతి ఆరాధన, జీవజాల రక్షణ ఉండింది. కాని స్వాతంత్ర్యం వచ్చాకే జీవహింస పెరిగింది. అడవులు అంతరించుకుపోతున్నాయి. జంతువధ పెరుగుతోంది. చెరువులు ఇళ్ళ స్థలాలవుతున్నాయి. నీళ్లు లేక అడవుల్లోని జంతువులు గ్రామాలలోకి వచ్చి మృత్యువాత పడుతున్నాయి. ప్రకృతి సమతుల్యాన్ని కాపాడుకోకుంటే అది మానవ వినాశనానికే దారి తీస్తుంది.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## ఓటును అమ్మొద్దు

ఎన్నికలలో ఓట్లను అమ్ముకునే పరిస్థితి పెరిగిపోతుంది. ఓటరు తన చేతిలో పడే 500నోటును చూస్తున్నాడేగాని 5ఏళ్ల తన భవిష్యత్‌ను వారికి అమ్ముకుంటున్నాననే ఆలోచన చేయడం లేదు. ఓటుకు కరెన్సీ నోటుతో విలువ కట్టడం సిగ్గు పడాల్సిన విషయం. ఓటును అమ్ముకోవడం అంటే వేశ్య తన శీలాన్ని అమ్ముకోవడంతో సమానం.

*బి.శేఖర్, నెల్లూరు.*

## ఆటోలను పట్టించుకోరా

నెల్లూరు నగరంలో ట్రాఫిక్‌కు 80శాతం ఆటోలే కారణం. బైక్ దూరే సందుంటే ఆటో దూర్చేస్తున్నారు. వాటిని నియంత్రించే వారే కరువవుతు న్నారు. ఎస్పీ ఒకసారి బైక్‌లో రోడ్లలో తిరిగితే పరిస్థితేంటో ఆయనకు అర్థమవుతుంది.

జె.యస్.కృష్ణ, నెల్లూరు.

# 'ప్రభా'తం

## ఖరీదైన ఎన్నికలు



దేశ రాజకీయాలనే ఆంధ్రప్రదేశ్ మార్చేస్తుంది. ఈరోజుకీ మిగతా రాష్ట్రాలలో అంతోఇంతో నిజాయితీతో కూడిన ఎన్నికల వాతావరణం కనిపిస్తుంది గాని, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం రాజకీయం పూర్తిగా డబ్బుమయమైంది. ఎన్నికల్లో మద్యందే రాజ్యమైంది.

రాజకీయామంటే ఇదేనా... ఎన్నికలు ఇట్లాగే వుంటాయా? రాజకీయపార్టీలకు ఒక సిద్ధాంతమంటూ ఉండదా? రాజకీయ నాయకులకు విలువలు అంటూ ఉండవా? ఉదయం ఒక పార్టీ కండువాను మెడలో వేసుకుని, సాయంత్రం ఇంకో పార్టీ జెండాను చేత్తో పట్టుకుంటే దానిని ఏం రాజకీయమనుకోవాలి? ప్రైవేట్ సంస్థలలో పని చేసే ఉద్యోగులు సైతం తాము ఆ కంపెనీని వదిలిపోవాలంటే మూడునెలలు, ఆరునెలలు ముందుగా చెబుతారు. ఆ కనీస ధర్మం రాజకీయనాయకులకు వర్తించదా? రాజకీయపార్టీలు ఆ ధర్మాన్ని అమలు చేయలేవా? ఈరోజు ఒక నాయకుడు ఒక పార్టీని బండబూతులు తిడతాడు, ఆ నాయకుడికి తానుంటున్న పార్టీలో టిక్కెట్ ఇవ్వకపోతే ఏ పార్టీనైతే అంతకుముందు బూతులు తిట్టాడో అదే పార్టీలో చేరి అదే పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడు. దీనిని ఏ రకం రాజకీయ మనుకోవాలి? ఇలాంటి రాజకీయాలు మన దేశానికి అవసరమా? కాని నేడు దేశవ్యాప్తంగా జరుగుతున్నదిదే! అన్ని రాజకీయపార్టీలు కూడా ఈ సిగ్గుమాలిన విధానాన్నే ప్రోత్సహిస్తున్నాయి కూడా! సిద్ధాంతపరంగా ఏ పార్టీ కూడా అభ్యర్థులను ఎంపిక చేయడం లేదు. తమను అంతకుముందు ఎన్ని తిట్టి ఉన్నా సరే, అభ్యర్థికి ఆర్థిక బలం ఉంటే చాలు... టిక్కెట్లిచ్చేస్తున్నారు. కొన్నేళ్ల క్రితం రాజకీయాలలో డబ్బు ప్రభావం చాలా తక్కువగా ఉండేది. పార్టీలు, అభ్యర్థుల వ్యక్తిగత గుణాలు, నీతి, నిజాయితీ, అతని పనితీరు ఎన్నికలపై ప్రభావం చూపేది. ఇప్పుడు అలా కాదు. అభ్యర్థి ఎంత పనికిమాలిన వాడైనా ఫర్వాలేదు. దండిగా డబ్బుంటే చాలన్నట్లుగా టిక్కెట్లిచ్చేస్తున్నారు. ఈరోజు దేశవ్యాప్తంగా కూడా డబ్బు చుట్టే రాజకీయాలు తిరుగుతున్నాయి. అయితే ఇలాంటి ధన రాజకీయానికి అంకురార్పణ జరిగింది ఎక్కడబ్బా అని ప్రశ్నిస్తే మాత్రం వచ్చే సమాధానం ఆంధ్రప్రదేశ్.

అవును... దేశ రాజకీయాలనే ఆంధ్రప్రదేశ్ మార్చేస్తుంది. ఈరోజుకీ మిగతా రాష్ట్రాలలో అంతోఇంతో నిజాయితీతో కూడిన ఎన్నికల వాతావరణం కనిపిస్తుంది గాని, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం రాజకీయం పూర్తిగా డబ్బుమయమైంది. ఎన్నికల్లో మద్యందే రాజ్యమైంది. ఈ ఎన్నికలనే పరిశీలిద్దాం. దేశ వ్యాప్తంగా మిగతా అన్ని రాష్ట్రాలలో ఎంత ఎన్నికల ధనం పట్టుబడిందో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఆ స్థాయి ధనం పోలీసులకు పట్టుబడింది. మద్యం కూడా అంతే. మిగతా 28రాష్ట్రాలలో ఎంత మద్యాన్ని అయితే పట్టుకున్నారో, అంతే పరిణామంలో ఆంధ్రప్రదేశ్‌లో మద్యం నిల్వలను పట్టుకున్నారు. ఎన్నికలొచ్చాయంటే ఆంధ్రప్రదేశ్‌లో ధనం, మద్యం మంచినీళ్ల మాదిరిగా ప్రవహిస్తుంటాయి. ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లో ఒక అసెంబ్లీ అభ్యర్థికి అయ్యే ఖర్చు సాలీనా 10కోట్లు. లోక్‌సభ అభ్యర్థికి అయ్యే ఖర్చు సాలీనా 50కోట్లుగా అంచనా వేస్తున్నారు. 175అసెంబ్లీ నియోజకవర్గాలు, 25లోక్‌సభ స్థానాలు... మూడు ప్రధానపార్టీల అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటే ఎన్నికల వ్యయం ఏ స్థాయికి చేరుకుంటుందో అంచనావేయొచ్చు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చు కూడా ఆంధ్రప్రదేశ్‌లో అయినంతగా ఇంకే రాష్ట్రంలోనూ లేదు. ఆంధ్రప్రదేశ్‌లో ఒక అసెంబ్లీ అభ్యర్థికయ్యే ఖర్చును కర్నాటకలో నాలుగు అసెంబ్లీలకు, తమిళనాడులో ఆరు అసెంబ్లీలకు, ఈశాన్య రాష్ట్రాల్లో అయితే ఒక్కో రాష్ట్రం అభ్యర్థులకే ఖర్చు చేయొచ్చు. ఎన్నికలలో మద్యం పంపిణీ దాదాపు అన్ని రాష్ట్రాలకు పాకినా ఓటుకు 500రూపాయలు, వెయ్యి రూపాయలు ఇచ్చే సంస్కృతి మాత్రం ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 1989ఎన్నికలప్పటి నుండీ ఈ సంస్కృతి పెరుగుతూవస్తుంది. 1983, 1985 ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఆ కాలంలో మాకు అయిన ఎన్నికల ఖర్చు వేలరూపాయల్లో ఉండేదని ఇప్పుడు చెబుతుంటారు. కొందరు నాయకులకైతే చందాలు ఎక్కువగా వచ్చి ఖర్చు తక్కువగా వుండి, ఎన్నికల తర్వాత విరాళాల ద్వారా వచ్చిన డబ్బుల్లో కూడా కొంత మిగిలేది. 1983కు ముందు కాంగ్రెస్ టిక్కెట్ తెచ్చుకుంటే చాలు... గెలిచినట్లే అన్న వాతావరణం ఉండేది. 1983లో ఎన్టీఆర్ తెలుగుదేశంపార్టీని పెట్టాక ఆ పార్టీ టిక్కెట్ తెచ్చుకుంటే చాలు... కుక్కయినా గెలిచిపోతుందనే పరిస్థితి వచ్చింది. కేవలం పార్టీలు, నాయకుల మీద అభిమానంతోనే ధన ప్రభావం లేని రాజకీయాలు ఆంధ్రప్రదేశ్‌లో 1989వరకు నడిచాయి. కాని 1989 నుండే రాష్ట్ర రాజకీయాలు మార్పును సంతరించుకున్నాయి. ఎన్టీఆర్ ప్రభంజనాన్ని అడ్డుకోవడానికి ఆర్థికంగా బలవంతులైన అభ్యర్థులను రంగంలోకి దించడానికి తొలుత కాంగ్రెస్‌పార్టీ శ్రీకారం చుట్టింది. ఆ తర్వాత తెలుగుదేశం కూడా అదే పంథాను అనుసరించింది. ఈ రెండు పార్టీలు కూడా కాలానుగుణంగా ధన రాజకీయాలకు పెద్దపీట వేయడంతో సీట్లు విషయంలో కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలదే పైచేయి కాసాగింది. 1989కి ముందు రాష్ట్ర రాజకీయాలలో నిఖార్సయిన ప్రజాప్రతినిధులు 90శాతం ఉంటే కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలు ఓ 10శాతం మంది ఉండేవాళ్ళు. కాని ఇప్పుడు సీన్ రివర్సయ్యింది. ఆయా పార్టీల సీట్లను 90శాతం మంది ధనవంతులు ఆక్రమించేస్తున్నారు. 10శాతం టిక్కెట్లు మాత్రమే ధనబలం లేనివారికి దక్కుతున్నాయి. అవికూడా రిజర్వుడ్ కేటగిరిలోకి ఎక్కువగా పోతున్నాయి.

అసెంబ్లీకి లేదా, లోక్‌సభకు పోటీ చేయాలంటే నువ్వెంత ఖర్చుపెట్టుకుంటావ్, పార్టీకి ఎంతిస్తావ్ అనేది అన్ని రాజకీయపార్టీలలో వుంది. ఈ విషసంస్కృతి నుండి బయటపడకపోతే రాజకీయం సామాన్యుడికి అందని ద్రాక్షపండే అవుతుంది.

# 'అంతర్'జాతీయం

- ప్రధానిగా నరేంద్ర మోడీని అంగీకరించడం కష్టమని, ఎన్డీఏ కూటమిలో తమ పార్టీ చేరబోదని ఎన్సీపీ అధినేత శరద్‌పవార్ స్పష్టం చేసారు. యూపిఏ మూడోసారి కూడా కేంద్రంలోకి వస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేసారు.
- భారత సైన్యాధిపతిగా సైనికదళాల ఉపప్రధానాధికారి లెఫ్టినెంట్ జనరల్ దల్బీర్‌సింగ్ సుహాన్‌ను కేంద్ర రక్షణమంత్రిత్వ శాఖ నియమించింది. కొత్త ప్రభుత్వం ఏర్పడేదాకా సైన్యాధిపతిని నియమించొద్దని బీజేపీ లేవనెత్తిన అభ్యంతరాన్ని కేంద్రం పట్టించుకోలేదు.
- దక్షిణ పాకిస్థాన్‌లోని సుక్కూర్ జిల్లాలో జాతీయ రహదారిపై ఈ నెల 20వ తేదీ జరిగిన రోడ్డు ప్రమాదంలో 42మంది చనిపోయారు. వీరిలో 27మంది మహిళలు, పిల్లలు ఉన్నారు. కరాచీ వెళ్తున్న బస్సు ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగింది.
- భారత్‌కు చెందిన 15రకాల పక్షులు పరిణామక్రమంలో భిన్నంగా ఉండడంతో పాటు అంతరించిపోయే ముప్పును ఎదుర్కొంటున్నాయని జూలాజికల్ సొసైటి ఆఫ్ లండన్ ప్రకటించింది. లండన్‌లోని మేల్ విశ్వవిద్యాలయం ప్రపంచవ్యాప్తంగా అధ్యయనాన్ని నిర్వహించింది.
- ప్రముఖ పుణ్యక్షేత్రాలు కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయాలకు వెళ్లే రహదారులు విపరీతమైన మంచుకారణంగా మూసుకుపోయాయి. ఈ రహదారులను బాగుచేసి త్వరలోనే రాకపోకలను పునరుద్ధరిస్తామని ఉత్తరాఖండ్ ప్రభుత్వం ప్రకటించింది.
- భారత సంతతి ఆఫ్రికన్లు ఇందెస్‌నాయుడు, శిరీష్‌నానాభాయ్, రెడ్డీఐన్‌డేయుర్‌లను దక్షిణాఫ్రికా ప్రభుత్వం 'ఆర్డర్ ఆఫ్ మెండీ' అవార్డులతో సత్కరించనుంది. వీరు జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడారు. అలాగే మానవహక్కుల కోసం కృషి చేసిన అబ్దుల్లా హేజస్సత్‌కు 'ఆర్డర్ ఆఫ్ లథూలి' అవార్డును వైద్యరంగంలో అద్భుతాలు సృష్టించిన నమ్రితావాల్‌కు 'ఆర్డర్ ఆఫ్ మపన్‌జుబ్వే' పురస్కారాన్ని ఆదివారం దక్షిణాఫ్రికా అధ్యక్షుడు జాకబ్‌జుమా ప్రదానం చేయనున్నారు.
- ఈ నెల 20వ తేదీ అరేబియాలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఐదుగురు భారతీయులు మృతిచెందారు. వీళ్లు ప్రయాణిస్తున్న వాహనం టైరు పేలి పల్టీలు కొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కేరళ రాష్ట్రం మాలాప్పురం జిల్లాకు చెందిన మహ్మద్‌సలీం, మహ్మద్‌నవాస్, నౌషాద్, శ్రీధరన్, జనార్ధనన్‌లు మృతిచెందారు.

# వార్త వ్యాఖ్య

వార్త :- ఎన్నికలలో పోటీకి దూరం. – కిరణ్‌కుమార్‌రెడ్డి.
***వ్యాఖ్య :- గెలిస్తే ఎమ్మెల్యేనే... పోటీ చేయకుంటే మాజీసీఎం అంటారు కదా!***

వార్త :- భూస్వామ్య వ్యవస్థ నిర్మూలనకే తెలంగాణ. – కేంద్రమంత్రి జైరాం రమేష్.
***వ్యాఖ్య :- భూస్వామ్య వ్యవస్థకు బదులు దొరల వ్యవస్థను తెచ్చారు.***

వార్త :- విభజించి పాలించాలని చూస్తున్నారు. – మోడీపై రాహుల్ విమర్శ.
***వ్యాఖ్య :- ఆ సిద్ధాంతం మన పార్టీదేగా!***

వార్త :- దళిత బిడ్డ ప్రధాని కాకుండా కుట్ర. – మాయావతి.
***వ్యాఖ్య :- యూపిలో సీట్లొస్తే మీరు ప్రధాని అయిపోతారా?***

వార్త :- కె.వి.పి. నాకు బేరం పెట్టారు. – కేసీఆర్.
***వ్యాఖ్య :- కుదరలేదా...?***

వార్త :- ఇక ఎన్నికల్లో పోటీ చేయను. – గాదె వెంకటరెడ్డి.
***వ్యాఖ్య :- మీలాంటి పెద్దతరం వారికి టిక్కెట్లు కూడా రావులే!***

వార్త :- విభజనకు కారణమైన పార్టీలను ఓడించండి. – జైసపా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి.
***వ్యాఖ్య :- మిమ్మల్ని గెలిపించమని చెప్పుకోరా?***

వార్త :- ముస్లింల రిజర్వేషన్లకు కృషి. – ములాయంసింగ్‌యాదవ్.
***వ్యాఖ్య :- కులాలు, మతాల గురించి మాట్లాడుతారుగాని ఒక్కరూ పేదల రిజర్వేషన్లు గురించి మాట్లాడరే!***

వార్త :- వెన్నుపోటుదారు కేసీఆర్. – రాహుల్.
***వ్యాఖ్య :- మీరు జనాలకు పొడిచారు... అతను మీకు పొడిచాడు.***

వార్త :- జగన్ దోచిన సొమ్ముతో పదిసార్లు ఋణమాఫీ చేయొచ్చు. – బాలకృష్ణ.
***వ్యాఖ్య :- మీ పార్టీ అధికారంలో వున్నప్పుడు దోచిన సొమ్ముతో ఎన్నిసార్లు చేయొచ్చో కూడా చెప్పండి.***

వార్త :- కిరణ్‌ను సీఎం చేయడం కాంగ్రెస్ పొరపాటు. – రఘువీరారెడ్డి.
***వ్యాఖ్య :- అసలు కాంగ్రెస్‌కు ఓటేయడమే పొరపాటని జనం అంటున్నారు.***

వార్త :- బుద్ధుడు కూడా భార్యను వదిలేసారు. – మోడీ తమ్ముడు ప్రహ్లాద్‌మోడీ.
***వ్యాఖ్య :- భార్యలను వదిలేసిన వాళ్లంతా గొప్పవాళ్లయిపోతారని చెప్పడమా?***

# విద్యాశాఖకు పట్టిన చీడ, పీడ విరగడైంది



ఎట్టకేలకు అవినీతి, అహంకార అధికారిగా గుర్తింపు సంపాదించుకొన్న జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగాన్ని ప్రభుత్వం ఈనెల 19న విధుల నుండి సస్పెండ్ చేస్తూ (జిఓ.143) ఉత్తర్వులిచ్చింది. తదుపరి జిల్లా విద్యాశాఖాధికారి (ఎఫ్ఏసి)గా అదే కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న ఎన్.ఉషకు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ ఉత్తర్వులిచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆమె కార్యాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంతకు ముందే గుంటూరు ఆర్జేడీ పార్వతి సస్పెండ్ చేసిన ప్రధానోపాధ్యాయుడు శేషాద్రివాసు రామలింగం ఆదరణతో పదో తరగతి స్పాట్‌వాల్యూయేషన్‌లో అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తుండడంతో అతనిని డిఇఒ ఉష బాధ్యతల నుంచి తొలగించారు. మొత్తంమీద కొంత వరకు న్యాయం గెలిచినట్లైంది. కాని ఇంతటితో ఈ సమస్య తీరినట్టుకాదు జిల్లా విద్యాశాఖలో చీడను సమూలంగా నాశనం చేసే చర్యలు జిల్లా కలెక్టర్, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీలు, రాష్ట్ర ఉన్నతాధికారులు త్వరిత గతిన తీసుకుంటేనే మంచిది.

రామలింగం 19వతేదీ సస్పెండ్ ఉత్తర్వులు నెట్‌లో చూసి, ఆ జిఓ తనకు అందేలోపే తన బాధ్యతలను ఎవరికీ అప్పగించకుండా హైదరాబాద్ ప్రయాణమయ్యారు. 21వతేదీ హైకోర్టులో తన సస్పెన్షన్‌ను నిలుపుదల చేయమంటూ పిటిషన్ దాఖలు చేసినట్టు తెలిసింది. ఏ అధికారి ఇంత నిర్లజ్జగా అవినీతికి ప్రతిరూపంగా నిలిచి దొంగదారులు తొక్కి భయంలేకుండా ప్రవర్తించదేమో! గుంటూరు జిల్లాలో రూ॥ 50వేలు లంచం తీసుకుంటూ ఏసిబి అధికారులకు చిక్కి దానిని శాఖాపరమైన విచారణగా తన పలుకుబడితో మార్పించుకొన్న సంగతి జగద్విదితమే. ఏడేళ్ళ తరువాత మళ్ళీ ఇప్పుడు ఆ కేసును విచారించేందుకు ప్రభుత్వం ఏసిబి అధికారులకు అనుమతి ఇచ్చిందంటే ఇన్ని రోజులు తన మాయాజాలంతో రాజకీయ పలుకుబడి, లంచాలతో ఆ కేసును తొక్కిపెట్టి వుండడం జరిగినట్లే కదా! ఇప్పుడు కూడా సస్పెన్షన్ జిఓలో జిల్లా కేంద్రం నుంచి ఎక్కడికీ వెళ్ళకూడదని ఆదేశించి వుండగా, ఆ ఉత్తర్వులను అందుకోకుండానే హైదరాబాద్ వెళ్ళి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడమంటే అతనిది ఎంత జిత్తులమారితనమో కదా! అయితే ఈసారి అతని పప్పులు ఉడకకపోవచ్చు. ఫిబ్రవరి 26న యూటీఎఫ్, ఏపీటీఎఫ్ ఉపాధ్యాయసంఘాలు అతని అక్రమాలు, అవినీతికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ధర్నాకు దిగాయి. జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ దానిపై స్పందించి అతని అక్రమాలపై విచారణకు ఆదేశించారు. విచారణ నివేదికను రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపారు. వారు పరిశీలించిన తర్వాత గవర్నర్ నరసింహన్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి రాజేశ్‌తివారి ఈ అవినీతిపరుడిని సస్పెండ్ చేస్తూ జిఓ 143ను విడుదలచేసారు. సిసిఏ రూల్సు 1991 ప్రకారం క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్టు జిఓలో వివరించారు. ఈ ఉత్తర్వులకు కలెక్టర్ నివేదికతో పాటు పలుపత్రికల్లో డీఈఓ అక్రమాలపై వచ్చిన కథనాలు కూడా తోడయ్యాయి. కాని అతనిని మాత్రం తక్కువ అంచనా వేయడానికి లేదు. మన చట్టాలలోని లొసుగులను ఎంత బాగా ఉపయోగించుకోవచ్చో అతనికి వెన్నతో పెట్టిన విద్య. వాటిని ఉపయోగించుకొని, సంఘంలోని కొన్ని చీడపురుగుల అండతో ఇన్నాళ్ళు అతను చలామణి కావడం జరుగుతోంది. అతనితోపాటు అతనికి అండగా నిలుస్తున్న కొన్ని సంఘాలలోని దుష్టగణాలను కూడా నియంత్రించనిదే అతనిని శిక్షించడం కష్టసాధ్యం పారాహుషార్!

## యర్రబోలు వెంకటకృష్ణయ్య ట్రస్ట్ సేవా కార్యక్రమాలు

నెల్లూరు బి.వి.నగర్ రెండోవీధిలో ఈనెల 21న ప్రముఖ విద్యాదాత స్వర్గీయ యర్రబోలు వెంకటకృష్ణయ్య ట్రస్టు సమావేశం జరిగింది. సభకు డా॥యండి నిజాముద్దీన్ అధ్యక్షత వహించగా ట్రస్ట్ ఛైర్మన్ సునీల్‌బాబు మాట్లాడుతూ 1970సంవత్సరంలో ప్రభాత్ ఇంగ్లీషుమీడియం స్కూలును ప్రారంభించి ఎందరో పేద, మధ్య తరగతి విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దిన యర్రబోలు వెంకటకృష్ణయ్య జ్ఞాపకార్థం పలుసేవా కార్యక్రమాలతో పాటు విద్య, వైద్య, సాంస్కృతిక రంగాలలో ప్రతిభావంతులను ప్రోత్సహించే కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ట్రస్ట్ కన్వీనర్ అరవ పూర్ణప్రకాష్ మాట్లాడుతూ ప్రతి ఏటా ట్రస్ట్ తరపున క్రీడాపోటీలు నిర్వహించి క్రీడాకారులలో దాగివున్న సృజనాత్మకశక్తిని వెలికి తీస్తామని తెలిపారు. తదుపరి యర్రబోలు వెంకటకృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు టివి సీరియల్ నటుడు సూర్య, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, యర్రబోలు రాజేష్, ఎస్.కె.రఫీ, పూండ్ల వెంకటేశ్వర్లు, పూండ్ల శ్రీహరి, వాకాటి సురేష్, అక్షిత, శ్రీలత, వంశీ, నాగరాజు, సుష్మ తదితరులు పాల్గొన్నారు.

## 30న "శ్రీశ్రీ" 104వ జయంతి



ఈనెల 30వతేది బుధవారం సాయంత్రం 6గం॥లకు నెల్లూరులోని శ్రీ కస్తూరిదేవి విద్యాలయం ప్రాంగణంలోని రవీంద్రనాథ్‌టాగూర్ ఆడిటోరియంలో మహాకవి శ్రీశ్రీ 104వ జయంతి వేడుకలు శ్రీశ్రీ ప్రగతి ట్రస్ట్ మరియు వర్ధమానసమాజంల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ న్యాయవాది వేములపాటి అనంత రామయ్య అధ్యక్షత వహిస్తుండగా ముఖ్య ఉపన్యాసకులుగా ప్రఖ్యాతకవి కె.శివారెడ్డి హాజరవుతారని, కావున నగర ప్రజలు పైకార్యక్రమములో పాల్గొని సభను జయప్రదం చేయాలని నిర్వాహకులు ఒక ప్రకటన ద్వారా కోరారు.

## దుష్టసంహారానికి ఓటే పాశుపతాస్త్రం

ఆసన్నమైంది దుష్టసంహార తరుణం
దగ్గర పడింది దుర్మార్గులకు రాజకీయ మరణం
నిజాతీపరులకే దక్కాలి ఓటరన్న(క్క) శరణం
సాగించు ఇక అవినీతిపరులపై మీ రణం
నేటి వ్యవస్థ దుస్థితికి ఈ అక్రమాల 'సెట్టింగు'లే కారణం
రాజకీయ ఊసరవెల్లుల ఆటలిక సాగనివ్వకు
మాయల మరాఠీలిచ్చే అవినీతి నోటుకు లొంగకు
అరచేతిలో వైకుంఠం చూపించే శుష్క వాగ్దానాలను నమ్మకు
అబద్ధాల కోరులను తరిమికొట్టేందుకు వెనుకాడకు
చూపించు నీ ప్రతాపం పాశుపతాస్త్ర ఓటు వజ్రాయుధంతో
కబ్జాకోరుడు, అక్రమార్కుడి ప్రతి ఆహారణువులో ఉంటాయి నీ స్వేదం, రుధిరం
చీల్చిచెండాడు ధనమదాందులను, అధికార కాంక్షులను
నీతికి, మంచికి పట్టంకట్టు
తొమ్మిది పదుల శాతం
అభ్యర్థుల పోటీ అక్రమార్జన కోసమేనని గ్రహించు
మనసాక్షితో ఓటు ముద్ర వేయి - వెగటు 'రాజకీయాలను తరిమివేయి
అడ్డగోలు నాయక ప్రబుద్ధులందరికీ చూపించు మొండిచేయి
కుటుంబ వారసత్వపాలనను కూకటివేళ్ళతో పెకలించవోయి
చెట్టుపేరు చెప్పి కాయలమ్ముకునేవాడొకడు
వంశచరిత్ర వల్లెవేసి దండుకునేవాడొకడు
విభజనలో అన్ని పార్టీలది 'తలాపాపం-తిలాపిడికెడు'
అసమర్థుడు, అనామకుడు అనుకుంటే కొత్తగా వచ్చిందిగా తిరస్కరణ ఓటు!
ఓటరన్నా చైతన్యం నింపుకో!!

అమరకృష్ణ, 9493916125.

## ఎన్నికల నిబంధనలు అతిక్రమించరాదు

### జిల్లా కలెక్టర్ శ్రీకాంత్



నెల్లూరు కలెక్టర్ ఛాంబర్‌లో ఈనెల 22న సహాయ ఎక్స్‌పెండిచర్ అధికారులతో పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి సంబంధించిన వివిధ ఖర్చుల నిర్వహణపై జరిగిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలలో పోటీచేయు అభ్యర్థులు పత్రికల ద్వారా, ఎలక్ట్రానిక్ ఛానల్స్ ద్వారా ప్రకటనలు, పెయిడ్ న్యూస్ ద్వారా ప్రచారం చేయడంపై జిల్లా కేంద్రంలో మీడియా సర్టిఫికేషన్ మరియు మానిటరింగ్ కమిటీ ఏర్పాటుచేయడమైందని తెలిపారు. ఈ కమిటీ ప్రతిరోజూ ఎప్పటికప్పుడు పత్రికలపరంగా, టివి ఛానల్ ద్వారా పర్యవేక్షించి అభ్యర్థులు ప్రచారం కొరకు పెట్టే ఖర్చులను ప్రభుత్వం నివేదించిన రేటు ప్రకారము లెక్కకట్టి నమోదుచేయడం జరుగుతుందన్నారు. ఆ నివేదిక సంబంధిత నియోజకవర్గ అసిస్టెంట్ ఎక్స్‌పెండిచర్ అధికారికి పంపడం జరుగుతుందన్నారు. అలాగే ఇతర మార్గాల ద్వారా ప్రచారము చేసే ఖర్చులను నిబంధనల మేరకు లెక్కకట్టి నమోదు చేయాలన్నారు. నిబంధనల ప్రకారము ప్రచారం చేయకుండా అతిక్రమిస్తే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. షాడో కమిటీ, ఎక్స్‌పెండిచర్ కమిటీ, తదితర కమిటీలను నియమించి అభ్యర్థుల ప్రచారానికి సంబంధించిన విషయాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీమతి జి.రేఖారాణి, ట్రెయినీ జాయింట్ కలెక్టర్‌యం.ఇంతియాజ్, అదనపు జాయింట్ కలెక్టర్ ఆర్.ఎస్.రాజ్‌కుమార్, సహాయ ఎక్స్‌పెండిచర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీలో భారీగా చేరిన

## కాంగ్రెస్, ముస్లింనేతలు

తెదేపా నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసంలో ఈనెల 22న భారీగా కాంగ్రెస్ నుంచి కార్యకర్తలు, ముస్లింనేతలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ ఉద్యోగ కల్పనకు అవకాశం వుండేలా ఐటీ పరిశ్రమలను సీమాంధ్రలో హైదరాబాద్‌లోలా నిర్మించాలని, అది ఒక్క బాబు వల్లే సాధ్యమవుతుందన్నారు. దానికి కేంద్ర సహకారం అవసరమవుతుందని, అందుకే నరేంద్రమోడీ ప్రధాని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం అన్ని రకాల అభివృద్ధి చెందుతుందన్నారు. కాబట్టి బిజెపి, టీడీపీ అభ్యర్థులను కేంద్రానికి, రాష్ట్రానికి అందించేలా మనం కృషి చేయాలన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో అనేక పరిశ్రమల స్థాపనకు కృషిచేసానని, ఇరవై వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించానన్నారు. జిల్లాలోని ప్రతి రెండు నియోజకవర్గాలకు ఓ పరిశ్రమను తీసుకువచ్చి ఉపాధి అవకాశాలు పెరిగేలా చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో మహిళలు, యువత, రైతులు చైతన్యంతో కదిలి అన్ని విధాలా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే చంద్రబాబునాయుడును గెలిపించుకుందామని కోరారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కొండ్రెడ్డి రంగారెడ్డి, వై.వి.రామిరెడ్డి, హరిబాబు యాదవ్, రాచాల రవి కుమార్‌యాదవ్, యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, నూనె మల్లికార్జున యాదవ్, స్వర్ణా వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యంపై ఉక్కుపాదం



ఎన్నికల నేపథ్యంలో పూర్తి స్థాయిలో మద్యం సరఫరాను కట్టడి చేస్తున్నట్లు నెల్లూరుజిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నెల్లూరులోని ఎక్సైజ్-2 స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో మద్యంతో ఓటర్లను ప్రలోభపెట్టే అవకాశమున్నందున మద్యం నియంత్రణకు చర్యలు చేపడుతామన్నారు. ఇటీవల పలు ప్రాంతాలలో దాడులు నిర్వహించి అక్రమంగా దాచిపెట్టిన మద్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సిఐలు జి.సూర్యనారాయణ, బి.వెంకటేశ్వర్లు, బి.కిషోర్‌లు పాల్గొన్నారు.


ఓటుకు విలువివ్వండి..
నియోజకవర్గ అభివృద్ధికి చోటివ్వండి
మీ అసెంబ్లీ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థికి ఓటు వెయ్యండి



శ్రీకాళహస్తి నియోజకవర్గ ఓటరు మహాశయులకు కాంగ్రెస్ పార్టీ హృదయ పూర్వక శుభాకాంక్షలు. శ్రీకాళహస్తి పట్టణంలో మే 7వ తేదిన జరిగే అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్‌పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరుతూ... మీ ముందుకొచ్చాను. తిరుపతి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ చింతామోహన్ గారి సహకారంతో శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా మీ ఆశీస్సులు కోరుతున్నాను. కనుక నాపై దయవుంచి మీ కుటుంబ సభ్యులలో ఒక్కడిగా ఆదరించండి... ఆశీర్వదించండి... ఒక్క అవకాశం ఇవ్వండి. ప్రజాసేవకుడంటే ఎలా ఉండాలో నిరూపించుకుంటాను. శ్రీకాళహస్తి నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి శాయశక్తులా కృషిచేస్తూ ఎప్పుడూ మీ వెంటే నడుస్తాను. మీ ఆశీస్సులు కోరుతూ...



డాక్టర్ ఎస్.బత్తెయ్యనాయుడు
కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి
శ్రీకాళహస్తి నియోజకవర్గం

హస్తం గుర్తుకు ఓటేయండి
బత్తెయ్యనాయుడు గారిని
గెలిపించండి



ఎస్.నాగూరయ్య
కాంగ్రెస్ పార్టీ కార్యకర్త
శ్రీకాళహస్తి

# న్యూయార్క్ సదస్సుకు డాక్టర్ జగదీష్



ప్రముఖ అంతర్జాతీయ ప్రత్యామ్నాయ ఇంధనవనరుల నిపుణుడు, నెల్లూరులోని నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్ ఐక్యరాజ్యసమితి హెడ్‌క్వార్టర్స్ న్యూయార్క్‌లో జూన్ 4 నుండి 6వరకు జరిగే సస్టైనబుల్ ఎనర్జీ ఫర్ ఆల్‌ఫోరమ్‌లో పాల్గొనేందుకు ఆహ్వానం అందుకున్నారు. ప్రతిష్టాకరమైన ఈ సదస్సులో ఐక్యరాజ్యసమితి ప్రెసిడెంట్, సెక్రటరి జనరల్, ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ తదితర ప్రపంచ నాయకులు పాల్గొంటారు.

సస్టైనబుల్ ఎనర్జీ ఫర్ ఆల్ అనుబంధ సంస్థ యు.ఎన్.ఫౌండేషన్ వాషింగ్టన్ వర్కింగ్ గ్రూప్ ఆఫ్ సప్లై చైన్స్ అండ్ ఎంట్రెప్రెనర్‌షిప్, ఎనర్జీ, అగ్రికల్చర్‌లో డాక్టర్ జగదీష్ సభ్యులు. జూన్‌లో జరిగే సదస్సులో ప్రపంచవ్యాప్తంగా ఎనర్జీ సమస్యలను, ఎనర్జీని పెంపొందించేందుకు మార్గాలు మొదలైన అంశాలపై విస్తృత చర్చ జరుగుతుంది. డాక్టర్ జగదీష్ ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, వాతావరణం అప్రాప్రియేట్ టెక్నాలజీలపై విశేష కృషి చేసారు. 140అంతర్జాతీయ, జాతీయ వైజ్ఞానిక పత్రికలలో డాక్టర్ జగదీష్ వ్యాసాలు ప్రచురించారు. 40దేశాలలో జరిగిన అంతర్జాతీయ సదస్సులలో డాక్టర్ జగదీష్ పాల్గొన్నారు. 15అంతర్జాతీయ, జాతీయ అవార్డులను అందుకున్నారు.

### రత్నాల ప్రతిభకు...

# స్మార్ట్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఉత్తమ పురస్కారాలు



నెల్లూరు సరస్వతినగర్‌లోని డా॥ కిషోర్స్ రత్నం హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి ఎల్.రూపేష్, 7వ తరగతి విద్యార్థి ఎస్.శ్రీవాత్సవలు మూడవ జాతీయ స్మార్ట్ ఒలింపియాడ్ పరీక్షల్లో విజయం సాధించి నెల్లూరుజిల్లా ఖ్యాతిని రాష్ట్రస్థాయిలో చాటిచెప్పారు. మన జిల్లా నుండి వీరిద్దరు మాత్రమే అవార్డులు సాధించడం విశేషం. ఇటీవల ఇంటర్నెట్ ద్వారా ప్రకటించిన ఈ ఫలితాలలో అవార్డులు సాధించి, సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య చేతులమీదుగా అవార్డులు అందుకున్నారు. వీరికి ట్యాబ్‌లతో పాటు గోల్డ్‌మెడల్స్, సర్టిఫికెట్లను స్మార్ట్ ఒలింపియాడ్ ఫౌండేషన్ వారు బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో డా॥కిషోర్స్ రత్నం జెన్‌నెక్స్ట్ స్కూల్స్ జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు అవార్డులను కైవసం చేసుకున్న ఎల్.రూపేష్, ఎస్.శ్రీవాత్సవలను అభినందించారు. వీరితో పాటు ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డును అందుకున్న వసుంధర మరియు ఉత్తమ గైడ్‌టీచర్ అవార్డు అందుకున్న షేక్ ఆలీలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డా॥ కిషోర్స్‌రత్నం జెన్‌నెక్స్ట్ స్కూల్స్ సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 'క్యాప్'లో ఆర్‌వీఎం డైరక్టర్



'క్యాప్' చిన్నారులతో శ్రీమతి ఉషారాణి

రాజీవ్ విద్యామిషన్ ప్రాజెక్ట్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీమతి ఉషారాణి ఈనెల 22న నెల్లూరు కొండాయపాలెం గేటు వద్దగల పోలీస్ అండ్ చైల్డ్ ప్రాజెక్ట్(క్యాప్)ను సందర్శించారు. ఏఆర్ ఏఎస్పీ వి.సి.నాగేశ్వరరావు, వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శ్రీమతి టి.వసంతలక్ష్మి, పోలీసు కళాశాల ప్రిన్సిపాల్ కొల్లూరు శ్రీనివాసరావు ఆమెకు స్వాగతం పలికారు. గతంలో ఎస్పీగా పనిచేసిన రమణకుమార్ ఎంతో శ్రద్ధతో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టారని దీని పనితీరు బాగుంది కాబట్టే దీని అభివృద్ధి కోసం రాజీవ్ విద్యామిషన్ ప్రాజెక్ట్ నుండి నిధులు విడుదల చేసామన్నారు. ఈ ప్రాజెక్ట్‌ను అంకితభావంతో నిర్వహిస్తున్న జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఆమె అభినందించారు.

# అందరూ ఓటేయాలి

ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకొనేలా చూడాలని జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవాల్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నెల్లూరు పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర పోలీసు మెమోరియల్ హాలులో ఆయన డిఎస్పీలు, సిఐలతో నేరసమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పారదర్శకంగా, నిజాయితీతో తమ ఎన్నికల విధులు నిర్వహించాలని పోలీసు అధికారులకు సూచించారు. మే 7వ తేదీన జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయని, ఎలాగైనా గెలవాలన్న కాంక్షతో అభ్యర్థులు, ధనం, మద్యంను విచ్చలవిడిగా పంపిణీ చేసే అవకాశముందని, దీనిని అడ్డుకునేందుకు పోలీసుయంత్రాంగం సిద్ధంగా వుండాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో షాడోపార్టీలను ఏర్పాటు చేసి అభ్యర్థుల కదలికలను పరిశీలించాలన్నారు. ఆయా స్టేషన్‌లలో పెండింగ్‌లో వున్న కేసులను వెంటనే పరిష్కరించాలన్నారు.

ఈ సమావేశంలో ఏఎస్పీ రెడ్డిగంగాధరరావు, డిఎస్పీలు వెంకటనాథ్‌రెడ్డి, వివిఎస్.రాంబాబు, బాలకోటేశ్వరరావు, మాల్యాద్రి, చౌడేశ్వరి, శిల్పవల్లి, ఎస్.బి సిఐ వై.జయరామసుబ్బారెడ్డి, సిఐలు పాల్గొన్నారు.

# అటవీసిబ్బందికి ఆయుధాలు

అటవీ సిబ్బంది ఆయుధాలు ఉపయోగించడానికి రాష్ట్ర ప్రభుత్వం నుండి అనుమతి లభించింది. ఇటీవల శేషాచలం అడవుల్లో ఎర్రచందనం స్మగ్లర్లు దాడిచేసి ఇద్దరు అటవీసిబ్బందిని హతమార్చడం తెలిసిందే! దీంతో ఎర్రచందనం స్మగ్లర్ల ఆట కట్టించాలంటే తమకు ఆయుధాలు కావాలని అటవీశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఈ నేపథ్యంలో ఎనిమిది 12బోర్‌పంప్ యాక్షన్ గన్స్‌ను జిల్లా ఎస్పీ అనుమతితో తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ తుపాకుల వినియోగంపై ఇటీవల జిల్లా అటవీ సిబ్బందికి తిరుపతిలో శిక్షణ ఇచ్చారు.

# నెల్లూరు కబుర్లు

## నెల్లూరులో వెంకయ్య



బీజేపీ జాతీయ నాయకులు యం.వెంకయ్యనాయుడు బుధవారం జిల్లాలో బీజేపీ, తెలుగుదేశం అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉదయం వెంకటాచలం నుండి నెల్లూరుకు చేరుకున్న వెంకయ్య నాయుడుకు అయ్యప్పగుడి సెంటర్ వద్ద బీజేపీ, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అక్కడనుండి వి.ఆర్‌సి వరకు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఓపెన్‌టాప్ జీపులో రోడ్‌షో నిర్వహించిన వెంకయ్య నాయుడు దారిపొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ ఈ ఎన్నికల్లో బీజేపీ, తెలుగుదేశం అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు.

## డిఇఓగా ఉష



జిల్లా విద్యాశాఖాధికారిగా ఎన్.ఉష ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మువ్వా రామలింగంను డిఇఓ విధుల నుండి సస్పెండ్ చేసిన వెంటనే జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఏడిగా పనిచేస్తున్న ఉషను పూర్తి అదనపు బాధ్యతలతో డిఇఓగా నియమించింది.

## ఆనంకు ఎస్సెమ్మెస్ బెదిరింపులు



స్టైల్ ఆఫ్ సింహపురి, నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ శాసనసభ్యుడు ఆనం వివేకానందరెడ్డి సెల్‌ఫోన్‌కు బెదిరింపు ఎస్సెమ్మెస్‌లు వస్తున్నాయని ఈనెల 20న ఆయన కలెక్టర్ శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేయడం నగరంలో హాట్ టాపిక్‌గా మారింది. ఎంతో కాలం నుంచి రాజకీయాల్లో వుంటున్న తనకు ఇటీవల కొందరు బెదిరింపు ఎస్సెమ్మెస్‌లు పంపుతున్నారని తత్సంబంధిత నంబర్లను జిల్లా ఎస్పీకి అందజేస్తానని, వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలని కోరుతూ నెల్లూరు కలెక్టర్ బంగ్లాలో కలెక్టర్ శ్రీకాంత్‌ను కలిసి ఆయన వినతిపత్రం అందించారు. విచిత్రంగా వుందికదా! నెల్లూరులో ఎప్పుడూ సింహంలాగా తిరిగే వివేకాకే బెదిరింపు, అసభ్యకర ఎస్సెమ్మెస్‌లు పంపడమంటే వాళ్ళకి కటకటాల వెనుక చేరాలన్న ఆశ ఎక్కువగా వున్నట్టే అనిపిస్తోంది.

## తెదేపాలోకి కాంగ్రెస్ నాయకులు

నెల్లూరు మినీబైపాస్‌లోని ఆదాల ప్రభాకరరెడ్డి నివాసంలో ఈనెల 19న పడారుపల్లికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తెదేపాలో చేరారు. వారిని ఆదాల తెదేపా కండువాలను కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో గుమ్మాప్రతాప్, దొడ్డ వెంకటరమణయ్య, శెట్టిపల్లి చైతన్య, పులి మహేష్‌యాదవ్, మేకల మధుసూదన్, ఎన్.వై.కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఒప్పంద ఉద్యోగులకు ఊస్టింగ్

సాంఘిక, బి.సి, గిరిజన సంక్షేమశాఖల పరిధిలోని హాస్టల్స్‌లో పనిచేస్తున్న 200మంది ఒప్పంద ఉద్యోగులను తొలగిస్తూ ఆ శాఖ డిడి ప్రసాద్‌రావు ఉత్తర్వులు జారీ చేసారు. దీంతో మూడేళ్లుగా వసతిగృహాలను నమ్ముకుని బ్రతుకుతున్న ఈ 200మంది పరిస్థితి ఒక్కసారిగా రోడ్డునపడ్డట్లయ్యింది.

## కాటేసిన రైలు

సోమవారం సాయంత్రం నెల్లూరులోని ఎస్2 సినీ కాంప్లెక్స్ ఎదురుగా రైలుపట్టాలు దాటుతూ రైలు ఢీకొన్న దుర్ఘటనలో పొదలకూరు టివి9 రిపోర్టర్ గంటా సుధాకర్ కుమారుడు సాయితేజ(17) మృతిచెందాడు. సాయితేజ నెల్లూరులోని నారాయణ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్ పూర్తిచేసి ఎంసెట్ కోచింగ్ తీసుకుంటున్నాడు. సోమవారం ఎస్2లో సినిమా చూసి రైలు పట్టాలు దాటుతుండగా వేగంగా వచ్చిన రైలు ఢీకొనడంతో సాయితేజ పక్కనే వున్న రాయిపై పడ్డాడు. తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సాయితేజ మరణంతో సుధాకర్ ఇంట విషాదం అలముకుంది.

## 'స్పాట్' కేంద్రంలో ఆర్జేడీ

నెల్లూరులోని పదోతరగతి పరీక్షా పత్రాల మూల్యాంకణ కేంద్రాన్ని సోమవారం విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరక్టర్ పార్వతి తనిఖీ చేసారు. డిఇఓ ముువ్వా రామలింగంను సస్పెండ్ చేసిన నేపథ్యంలో విద్యాశాఖ కార్యకలాపాలను యథావిధిగా నిర్వహించేందుకు ఆమెను నెల్లూరుకు పంపించారు. స్పాట్ వాల్యూషన్ కేంద్రంలో వున్న లోపాలను పరిశీలించి ఆమె సరిదిద్దారు.

## వైసిపిలోకి పిటి బ్రదర్స్

నెల్లూరులో వివిధ వ్యాపారాలు చేస్తున్న పి.టి.వాసు, పి.టి.జగన్నాథ్‌లు సోమవారం తమ అనుచరులతో కలిసి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వెంగళరావునగర్‌లోని రామాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ అభ్యర్థి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, నెల్లూరురూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

## 'సంకల్ప' రక్తదాన శిబిరం

నెల్లూరు రామలింగాపురంలోని నారాయణ బిఇడీ కళాశాలలో ఈనెల 20న సంకల్ప యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సంస్థ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ వైద్యశాల వైద్యుల పర్యవేక్షణలో 50మంది విద్యార్థులు రక్తదానం చేసారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నారాయణ కళాశాల మేనేజ్‌మెంట్ భాస్కర్‌రెడ్డి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఓట్ల లెక్కింపు కేంద్రాలుగా

## డికెడబ్ల్యూ, ప్రియదర్శిని

మే నెల 7న జరిగే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపును నెల్లూరులోని డికెడబ్ల్యూ కళాశాల, ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలల్లో నిర్వహించనున్నారు. ఎన్నికల తదుపరి ఈవిఎంలను ఆ కళాశాలల్లో భద్రపరిచి మే 16న ఓట్లు లెక్కిస్తారు. డికెడబ్ల్యూ కళాశాలలో నెల్లూరు పార్లమెంట్‌తో పాటు నెల్లూరు నగరం, నెల్లూరు గ్రామీణం, ఆత్మకూరు, కోవూరు, కావలి, ఉదయగిరి, నియోజకవర్గాల ఓట్లు, ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో తిరుపతి పార్లమెంట్‌తో పాటు సర్వేపల్లి, గూడూరు, సూళ్ళూరుపేట, వెంకటగిరి నియోజకవర్గ ఓట్లను లెక్కించనున్నారు.

## అర్థరాత్రి కోత

### ఝుమ్మంటూ దోమల మోత!

పగలే కాదు నగరంలో అప్పుడప్పుడు అర్థరాత్రి వేళల్లో కూడా కరెంట్ కోత విధిస్తుండడంతో రాకాసి ముదురుదోమలు జనంపై దాడిచేసి స్వైరవిహారం చేస్తున్నాయి. కరెంట్ పోయిన సమయంలో నరకం ఎలా వుంటుందో జనం ప్రత్యక్షంగా చూస్తున్నారు. ఈ ఎండల్లో ఏ.సి లేకపోయినా కనీసం ఫ్యానన్నా తిరుగుతుంటే జనానికి కొంత నిద్రపడుతుంది. మంచి నిద్ర సమయంలో కరెంట్ పోతుండడంతో జనాల అవస్థ ఆ దేవుడికెరుక.

# విభజన ద్రోహులకు చెప్పుతో సమాధానం

**- నెల్లూరు రోడ్‌షోలో కిరణ్**



తెలుగుజాతిని చీల్చి ప్రజల మధ్య విభజన మంటలు పెట్టిన రాజకీయ పార్టీలకు తమ పార్టీ గుర్తయిన చెప్పు తోనే సమాధానం చెప్పాలని జైసమై క్యాంధ్ర పార్టీ అధ్యక్షుడు ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమ వారం ఆయన నెల్లూరులో అయ్యప్ప గుడి నుండి నర్తకిసెంటర్ వరకు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి ఎస్‌బిటి హనీఫ్, నెల్లూరునగరం అభ్యర్థి ఆనం జయకుమార్‌రెడ్డి, నెల్లూరురూరల్ సీపీఎం అభ్యర్థి మాదాల వెంకటేశ్వర్లులను గెలిపించాలని కోరారు. సమైక్యాంధ్రను కాంక్షించే ప్రజలంతా చెప్పు గుర్తుకు ఓటేసి విభజనవాదులకు ఘాటుగా సమాధానం చెప్పాలన్నారు. నేను మొదటి నుండి సమైక్యవాదానికే కట్టుబడ్డాను. తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టడం కోసం కాంగ్రెస్ అధిష్టానాన్ని వ్యతిరేకించాను. విభజనకు వ్యతిరేకంగా పోరాడాను. రాష్ట్ర సమైక్యత కోసం ముఖ్యమంత్రి పదవినే వదులుకున్నానని ఆయన చెప్పుకొచ్చారు. కాంగ్రెస్, బీజేపీ, వైయస్సార్ కాంగ్రెస్, తెలుగుదేశం... ఈ నాలుగు పార్టీలు కూడా విభజనకు కారణమయ్యాయన్నారు. విభజనకు వ్యతిరేకంగా పోరాడింది సీపీఎం పార్టీయేనని, అందుకే ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్నామని చెప్పారు. జైసమైక్యాంధ్ర పార్టీతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.మధు, జైసపా, సీపీఎం అభ్యర్థులు పాల్గొన్నారు. కిరణ్ నగరంలోకి ప్రవేశించేటప్పుడు జైసపా కార్యకర్తలు ఓవైపు, సీపీఎం కార్యకర్తలు మరోవైపు నిలబడి తమ పార్టీ జెండాలు ఊపుతూ ఆయనకు ఘనస్వాగతం పలికారు.

సింహపురి సమాచారం



ఈ నెల 23వ తేదీన నెల్లూరులో తెలుగుదేశం, బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించిన రోడ్‌షోలో ప్రసంగిస్తున్న బీజేపీ జాతీయ నాయకులు యం.వెంకయ్యనాయుడు, పక్కన బీజేపీ అభ్యర్థి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, సినీనటుడు శివాజీ

# సహకరించుకుందాం... సమైక్యంగా విజయం సాధిద్దాం



కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు సురేంద్రరెడ్డి

క్రమశిక్షణగల కార్యకర్తలకు తెలుగుదేశం, బీజేపీలలో కొదువలే దని, వారి సహకారంతో ఈ రెండు పార్టీలు విజయపథంలో నడవడం ఖాయమని నెల్లూరు నగర ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ నగర కార్యకర్తల సమావేశంలో ముంగమూరు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు పార్టీలలో ఉన్న కార్యకర్తలు డబ్బుకోసమో, మద్యం కోసమో, ఎన్నికల తర్వాత వ్యాపారాల అవసరాల కోసమో పనిచేసేవాళ్లు కాదని, తాము నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పనిచేసే సైనికులని అన్నారు. ఇలాంటి కార్యకర్తలను కలిగి ఉండడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. నగర నియోజకవర్గంలో తెలుగుదేశం అభ్యర్థికి బీజేపీ కార్యకర్తలు, రూరల్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి గెలుపుకు టీడీపీ కార్యకర్తలు అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నెల్లూరు రూరల్ బీజేపీ అభ్యర్థి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ రావాలనే ఆకాంక్ష ప్రజల్లో బలంగా ఉందన్నారు. బీజేపీ, టీడీపీలు కలిసి పనిచేస్తే గెలుపు మనదేనన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, నాయకులు యం.ఈశ్వరయ్య, సి.హెచ్.వరదయ్య, మిడతల రమేష్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# సీమాంధ్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

**- రఘువీరారెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న రఘువీరారెడ్డి, పక్కన ఆనం రామనారాయణరెడ్డి

సీమాంధ్ర అభివృద్ధి కాంగ్రెస్‌పార్టీ తోనే సాధ్యమవుతుందని ఏపిసిసి అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి పేర్కొ న్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల ఎన్నికల ప్రచారం కోసం ఆయన సోమవారం నెల్లూరొచ్చారు. తొలుత ఎంపీ అభ్యర్థి వాకాటి నారాయణరెడ్డి ఇంట్లో జరిగిన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఆ తర్వాత కావలి, కోవూరులలో నిర్వ హించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని యూపిఏ ప్రభుత్వం వల్లే రాష్ట్రంలో పదేళ్లపాటు ఎంతో అభివృద్ధి జరిగిందని, మళ్లీ కాంగ్రెస్‌కే అధికారమిస్తే మరింతగా అభివృద్ధి సాధించవచ్చన్నారు. నెల్లూరుజిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందింది కాంగ్రెస్ హయాంలోనేనన్నారు. రానున్న ఐదేళ్లకాలంలో ఈ జిల్లా ఇంకా ఎంతో అభివృద్ధి సాధిస్తుందన్నారు. దుగరాజపట్నం పోర్టు వస్తే వేలసంఖ్యలో ఉద్యోగాలు వస్తాయన్నారు. సీమాంధ్రకు కాంగ్రెస్ పదేళ్ల పాటు పన్నురాయితీ ఇచ్చిందని, పెద్ద సంఖ్యలో ఇక్కడకు పరిశ్రమలు వస్తాయని ఆయన చెప్పారు. బి.సిలు, మైనార్టీలు, దళితుల గురించి కల్లబొల్లి మాటలు చెప్పే తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలు టిక్కెట్లు విషయం వచ్చేసరికి మొండిచేయి చూపాయని, కాని టిక్కెట్ల విషయంలో సామాజిక న్యాయం చేసింది కాంగ్రెస్ ఒక్కటేనన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ ఛైర్మెన్ ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పెండింగ్‌లోవున్న సాగునీటి ప్రాజెక్టులన్నింటిని పూర్తిచేస్తామన్నారు. జిల్లాలో ఈ 5ఏళ్లలో ఎన్నో అభివృద్ధి పనులు చేసామని, ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగడానికి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరులోక్‌సభ అభ్యర్థి వాకాటి నారాయణరెడ్డితో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ అభ్యర్థులు కూడా పాల్గొన్నారు.

# జనం జగన్‌తోనే ఉన్నారు



ప్రచారంలో పాల్గొన్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 20వ డివిజన్‌లో ఈనెల 22న ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, తెలుగు దేశం పార్టీలు ఎన్ని కుమ్మక్కు రాజకీయాలు సాగించినా, ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రప్రజలు వై.యస్.జగన్‌తోనే ఉన్నారని రాష్ట్రం ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వై.యస్. జగన్‌మోహన్‌రెడ్డి వంటి సమర్థ నాయకుడు అయితేనే రాష్ట్రాభి వృద్ధి జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. అందుకే ఎప్పుడు ఎన్నికలు జరిగినా వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగిస్తుందని జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు వై.యస్.ఆర్.కాంగ్రెస్‌పార్టీ గెలుస్తుందని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ తెలంగాణాలో టి.ఆర్.యస్‌ని సీమాంధ్రలో కిరణ్‌కుమార్‌రెడ్డి చేత పార్టీ పెట్టించి టిఆర్ఎస్, కిరణ్ ముసుగులో ఓట్లు దండుకునే దానికి కుయుక్తులు సాగిస్తుందని అయితే రాష్ట్ర ప్రజలు ఈ కుట్రలను, కుతంత్రాలను తిప్పికొడతారని అన్నారు.

నెల్లూరు రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ 30ఏళ్ళుగా ప్రజాఉద్యమాలలో జెండా భుజాన వేసుకొని పనిచేస్తున్నానని ఈరోజు వై.యస్.ఆర్.కాంగ్రెస్‌లో తనకు అవకాశం వచ్చిందని, రూరల్ నియోజకవర్గ ప్రజలు తమ బిడ్డలా తనను ఆదరించాలని ఆ ప్రోత్సాహాన్ని తాను కాపాడుకొని ప్రజ లకు ఒక నాయకుడిలా కాకుండా మంచి సేవకుడిగా పని చేస్తా న్నారు. కార్యక్రమంలో బత్తిన శోభన్‌రెడ్డి, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, సన్నపురెడ్డి వెంకటసుబ్బారెడ్డి, శివరంజన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## ప్రభుత్వవైద్యం బాగుంటే...

# ప్రైవేట్ ఆసుపత్రులకెందుకు పోతారు



రికార్డులు పరిశీలిస్తున్న వై.అనురాధ

ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు సక్రమంగా ఉండి పనిచేయకపోతుండబట్టే పేద, మధ్యతరగతి ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమీషనర్ వై.అనురాధ అసంతృప్తి వ్యక్తం చేసారు. 22వ తేదీన జిల్లాకొచ్చిన ఆమె నెల్లూరులోని పెద్దాసుపత్రిని, నిర్మాణంలో వున్న ప్రభుత్వ వైద్యకళాశాల భవ నాలను పరిశీలించారు. కోవూరులోని పిహెచ్‌సిని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు ఎందుకు తగ్గుతున్నాయని ఆమె ప్రశ్నించారు. వందలో 40ప్రసవాలు కూడా ప్రభుత్వాసుపత్రుల్లో ఉండడం లేదనేదానికి వైద్య సిబ్బందే కారణమని అసంతృప్తి వ్యక్తం చేసారు. వైద్యులు పనిచేసేది ఒకచోట, నివాసం మరోచోట ఉంటుండడం వల్లే ప్రభు త్వాసుపత్రుల్లో పూర్తిస్థాయి వైద్యసేవలందడం లేదన్నారు.

ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఇన్‌ఛార్జ్ డిఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ కోటేశ్వరి, వైద్యకళాశాల నోడల్ అధికారి డాక్టర్ రంగా రావు, ప్రభుత్వాసుపత్రుల ఇన్‌ఛార్జ్ సమన్వయకర్త డాక్టర్ విజయగౌరి, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ నవదీప్‌సింగ్

# గట్టి బందోబస్తుతో ఎన్నికలు

సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల బందోబస్తుకు గాను 20పారామిలటరీ దళాలు వస్తా యన్నారు. అలాగే ఆర్మేడ్ రిజర్వ్ పోలీసులతో పాటు ఏపిఎస్పీ బెటాలియన్ బందోబస్తును కూడా కోరామన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలకు స్వేచ్ఛగా ఓటేసే అవకాశం కల్పిస్తామన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# రాహుల్ కోసం వివేకా మాస్టర్ ప్లాన్

టెన్‌జనపథ్‌లోని తన గదిలో సోనియాగాంధీ దిగులుగా ముఖంపెట్టి కూర్చుని వుంది. ఆమె శూన్యంలోకి చూస్తూ ఏదో ఆలోచిస్తుంది. వి. హెచ్. హనుమంతురావు కాఫీకప్పుతో అక్కడకు వచ్చి... మేడమ్ ఉదయం నుండి మీరు పచ్చి మంచినీళ్లు కూడా ముట్టుకోలేదు, కనీసం ఈ కాఫీ అన్నా తాగండని అడిగాడు. నాకు కాఫీ తాగే మూడ్ లేదు. మధ్యాహ్నం, సాయంత్రం తిండి కూడా వద్దు, నాకేం ఆకలిగా లేదు... నువ్వెళ్లి పనిచూసుకోపో అని ఆమె కసిరింది. సోనియా ఇంత కోపంగా, ఇంత నిరాశగా, ఇంత దిగులుగా ఉండడం వి. హెచ్ ఎప్పుడూ చూల్లేదు. సోనియా వున్న పరిస్థితి చూసి వి. హెచ్. కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. వెంటనే ఆయన సెల్‌ఫోన్ నుండి కాంగ్రెస్ నాయకులందరికీ ఫోన్‌లు కొట్టాడు. ఓ అరగంటకల్లా చిదంబరం, దిగ్విజయ్‌సింగ్, గులాంనబీ ఆజాద్, దాసరి జైరాంరమేష్, మనీష్‌తివారి, అంబికాసోని వంటి నేతలు అక్కడ చేరిపోయారు. సోనియా విచారంగా ఉండడాన్ని గమనించిన వారంతా కోరస్‌గా... 'పెదవే పలికే మాటల్లోనే తియ్యని మాటే అమ్మా... కంటికి వెలుగమ్మా... తనలో మమతేకలిపి పెడుతుంది ముద్దగా" అనే పాట పాడారు. వారి పాటతో సోనియా ఈ లోకంలోకి వచ్చి ఒక చిన్న నవ్వు నవ్వింది. అప్పుడు చిదంబరం, దిగ్విజయ్‌లు కంబైన్డ్‌గా "ఊరికే కన్నీరు నింప కారణమేమమ్మా" అంటూ 'లవకుశ' సినిమాలోని పాటను పాడారు. అప్పుడు సోనియా... మీలాంటి బంగారుబిడ్డలు నా వెంట ఉండగా, నాకు దిగులెందుకు నాయనా... కాకపోతే రాహుల్ గాంధీ ప్రధాని అవుతాడా లేదా అనేదాని మీదే ఆలోచిస్తూ కలతచెందుతున్నాను. ఈ సర్వేలవాళ్లు నాకు నిద్ర కూడా పట్టనీయడం లేదు. ప్రతిరోజూ ఏదో ఒక సర్వేసంస్థ ఎన్డీఏకు అత్యధిక సీట్లు వస్తాయని, నరేంద్ర మోడీ ప్రధాని అవుతారని చెబుతూనే వుంది. ఆ సర్వేలు చూస్తే నాకు కంటిమీద కునుకు ఉండటం లేదు. రాహుల్‌ను ప్రధానిగా చూడాలన్న నా కోరిక నెరవేరుతుందో లేదో అని భయంగా వుందంది. ఆమె అలా మాట్లాడడంతో అక్కడున్న నాయకులంతా కొంత ఆలోచనలో పడ్డారు. తమకు రాజకీయ జన్మనిచ్చిన సోనియాగాంధీ ఓ చిన్న కోరిక కోరింది. అది కూడా నెరవేర్చలేకపోతే తమదీ ఓ బ్రతుకేనా అని తమలోతాము ప్రశ్నించుకున్నారు. వెంటనే దిగ్విజయ్‌సింగ్ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఫోన్‌చేసి టెన్‌జనపథ్‌కు రమ్మని కోరారు. పది నిముషాలకల్లా మన్మోహన్‌సింగ్ అక్కడ ప్రత్యక్షమయ్యారు. ఎందుకు పిలిచారని మన్మోహన్‌సింగ్ అడిగారు. దిగ్విజయ్‌సింగ్, సోనియా బాధపడుతున్న విషయం గురించి చెప్పాడు. దానికి నేనేం చేయాలని మన్మోహన్ అడిగాడు. అప్పుడు దిగ్విజయ్... మీరు ప్రధాని పదవికి ఇప్పుడే రాజీనామా చేసేస్తే, రాహుల్‌ను ప్రధానిగా ఎన్నుకుంటాం, ఈ నెలరోజులపాటు రాహుల్‌బాబును ప్రధానిగా చూసుకుని సోనియా గాంధీ గారు మురిసిపోతారని చెప్పాడు. ఆ మాట వినగానే సోనియాకు మండి... నేను రాహుల్‌ను ప్రధానిగా చూడాలనుకునేది మన్మోహన్‌సింగ్‌ను దించేసి కాదు... వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించి ప్రధానిగా చూడాలనుకుంటున్నాను. మీ మాత్రం బోడి తెలివితేటలు నాకు లేకనా? మన్మోహన్‌సింగ్ చేత రాజీనామా నేను చేయించలేకనా? ముందు మన పార్టీ గెలిచే మార్గం గురించి చెప్పండి అని కసురుకుంది. వెంటనే దాసరి జైరాంరమేష్ కలుగజేసుకుని, మన పార్టీ గెలవాలంటే ఒకటే మార్గముంది మేడమ్ అని అన్నాడు. ఏంటది అని సోనియా ఆతృతగా అడిగింది. దానికి జైరాంరమేష్... అన్ని లోక్‌సభ స్థానాలలో కూడా మన పార్టీ అభ్యర్థులకు పోటీ లేకుండా అవతల పార్టీల అభ్యర్థులు తప్పుకుంటే మన పార్టీ గెలుస్తుందని చెప్పాడు. ఆ మాటతో సోనియాకు మండి... ఈ చచ్చు సలహాలు వద్దు, మంచి సూచనలు చేయండని అంది. అంబికాసోని వుండి... 'గొడ్డొచ్చిన వేళ బిడ్డొచ్చిన వేళ' అంటారు, అబ్బాయికి పెళ్లి చేయండి. కోడలు కాలు పెట్టిన టైం బాగుంటే అబ్బాయి ప్రధాని అవుతాడు. అది కూడా ఇటలీ అమ్మాయినే వెదికి చేయండి. మీరు భార్యగా వచ్చాకే కదా రాజీవ్ ప్రధాని అయ్యింది. అలాగే రాహుల్‌కు కూడా ఇటలీ అమ్మాయి కలిసి వస్తుందేమో... అలాగే ఒక ఆవును కూడా కొని ఇంట్లో కట్టేయండి, పశువులు ఇంట్లో కొస్తే కాలం కలిసొస్తుందంటారు అని చెప్పింది. దానికి షిండే ఒప్పుకోలేదు. ఇటలీ కోడలు వచ్చాకే అత్త ఇందిరమ్మ పైకిపోయింది... ఇలాంటివి కాకుండా ఇంకేవన్నా ఆలోచించమని కోరాడు. అప్పుడే టి.సుబ్బరామిరెడ్డి అక్కడకు వచ్చాడు. జరిగిన సంభాషణంతా విన్న ఆయన... రాహుల్‌బాబును ప్రధాని చేయడం కోసం హోమాలు జరిపిద్దాం.. దేశంలోని అన్ని ప్రాంతాల నుండి పండితులను తీసుకొచ్చి యాగం చేయిస్తానని చెప్పాడు. దానికి సోనియా... మంత్రాలతో చింతకాయలు రాలుతాయా... యాగాలు, యజ్ఞాలతో ప్రధానులయ్యేపనయితే నరేంద్ర మోడీ దేశమంతా ఎందుకు తిరుగుతాడు. ఇవన్నీ పరిష్కారం కావు. నా సమస్యకు పరిష్కారం చెప్పే మొనగాడే లేడా అని ప్రశ్నించింది. 'ఒకడున్నాడు' అంటూ దిగ్విజయ్ సింగ్ లేచాడు. ఎవరు ఆ ఒక్కడు అని సోనియా ప్రశ్నించింది. స్టైల్ ఆఫ్ సింహపురి బిరుదాంకితుడు, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి(64) అని దిగ్విజయ్ చెప్పాడు. ఇప్పుడు ఎన్నికల్లో పోటీ చేసి, బిజీగా ఉంటాడేమో... ఇక్కడికి రాగలడా? అని సోనియా అడిగింది. మనం చేసిన విభజన దెబ్బకు అతను పోటీ నుండి మానుకుని ఖాళీగానే వున్నాడు. ఏం పీకే పనులు లేవు. రమ్మంటే వస్తాడు అని చెప్పాడు. వెంటనే రమ్మనమని సోనియా ఆదేశించింది.

★★★★★

ఓ గదిలో సోనియా, దిగ్విజయ్, షిండే, వివేకా కూర్చుని వున్నారు. వివేకా వుండి... మేడమ్, గదిలో చీకటిగా వుంది. లైట్లు వేయకూడదు అని అన్నాడు. దానికి సోనియా, మాకంతా వెలుతురుగానే వుంది, ముందు మీరు కళ్లకున్న ఆ నల్లద్దాలు తీయండని చెప్పింది. అప్పుడు విషయాన్ని గ్రహించి వివేకా అద్దాలు తీసాడు. రాహుల్‌ను ప్రధానిని చేయాలంటే మీ సలహా ఏంటని సోనియా అడిగింది. అప్పుడు వివేకా... నాదొకటే సలహా... అధికారం మన చేతిలో వుంది. ప్రధాని మనోడే, దేశంలోని 543 లోక్‌సభల ఓటర్ల లిస్టులు తెప్పించుకోండి, కాంగ్రెస్‌కు వేస్తారనుకున్న ఓట్లనే లిస్టులో వుంచి మిగతా ఓట్లను తొలగించేయండి... రాహుల్ ప్రధాని కావడం ఖాయమని చెప్పాడు. ఆ మాటకు సోనియా, దిగ్విజయ్, షిండేలు నోరెళ్లబెట్టారు.

## కదంబం

### కాల యవనిక

డా॥ఎన్.గోపి,
హైదరాబాద్, 93910 28496.

కొందరు ఎదుట లేకున్నా
ఉన్నట్టే ఉంటారు
జ్ఞాపకాల యవనిక మీద
అప్పటి వర్తమానం కదుల్తుంటుంది
ఈ క్షణంలో
వాళ్ళు ఇంకోలాగ ఉండొచ్చు
జ్ఞాపకాలు
గతం ప్రదర్శించే రూపకాలు
నీ స్పందన మాత్రం
ఇప్పటి వాస్తవరూపమే.

కాలానిదెప్పుడూ
నిరంతర గతి
దానిలో నీ ఉనికి
ఒక ప్రత్యేకమైన ఉపస్థితి.

## సమ్మోహనంగా సాగిన శ్రీ వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు



నెల్లూరు మూలాపేటలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఈనెల 10 నుండి 20వతేదీ వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు కడు వైభవంగా జరిగాయి. శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుని బ్రహ్మోత్సవాల్లో 14వతేదీ రాత్రి జరిగిన హనుమంతసేవలో శ్రీ రామచంద్రుడిగా వెండిహనుమంతవాహనంపై స్వామి విహరించారు. హనుమంతుని సేవాతత్పరత, రామభక్తిని గురించి ఆలయ అర్చకులు వివరించారు. ఉదయం జరిగిన పగడాల చప్పర ఉత్సవం భక్తులకు కనువిందు చేసింది. ఉభయకర్తలుగా చెరుకుపల్లి పిచ్చిరెడ్డి దంపతులు, వెండి హనుమంతసేవకు మాగుంట సుధాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, మాగుంట విజయ్‌రెడ్డి దంపతులు వ్యవహరించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, తుమ్మల సుబ్బారెడ్డి, మేనేజర్ కృష్ణ పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. రాత్రి 8గంటలకు మైలవరపు శ్రీనివాసరావు నేతృత్వంలో సామూహిక లలితా సహస్రనామ పారాయణం, ఆధ్యాత్మిక సత్సంగం జరిగింది. 15వతేది



ఉదయం మోహిని అవతారంలో స్వామి గిన్నెభిక్షలో దర్శనమిచ్చారు. రాత్రి గరుడ వాహనంపై వైభవంగా నగరోత్సవం జరిగింది. ఉభయకర్తలుగా పలగాటి చంద్రశేఖరరెడ్డి, దొడ్ల చెంచు రామిరెడ్డి దంపతులు వ్యవహరించారు. గరుడోత్సవంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య యజుర్వేద పారాయణం, ఉపనిషత్తులు పంచసూక్తములు, నారాయణ దివ్య ప్రబంధగానం, తిరుమంజనం తదితర కార్యక్రమాలు జరిగాయి. పూజా కార్యక్రమాలు ఆలయ ప్రధానార్చకులు సంపత్ కుమార్‌స్వామి ఆధ్వర్యంలో శ్రీనివాస అయ్యంగార్, చైతన్యశర్మలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. 16వతేదీ రుక్మిణీ, సత్యభామల నడుమ కొలువైన శ్రీ వేణుగోపాలుని కల్యాణం వైభవంగా జరిగింది. 17న భక్తజనంతో క్రిక్కిరిసిన మూలాపేట వీధుల్లో సర్వాలంకార శోభితుడైన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుడు రథంపై కొలువుదీరి మంగళవాయిద్యాలు, పండితుల మంత్రోచ్చారణ, సాంస్కృతిక ప్రదర్శనల మధ్య భక్తులకు కనువిందు చేస్తూ ఊరేగారు. ఉభయకర్తలుగా పేటేటి రాఘవరావు వ్యవహరించారు. రాత్రి పుష్పకవిమానంలో పేట ఉత్సవం, పుష్పకవిహార ఉత్సవాలు విశేష రీతిలో జరిగాయి. 18వతేదీ ఉదయం వెన్నెతాళి ఉత్సవం, రాత్రి అశ్వవాహనంపై పేట ఉత్సవంలో స్వామి సుందరరూపాన్ని దర్శించిన భక్తులు పులకితులయ్యారు. 19వతేదీ పొన్న వాహనోత్సవం వేడుక చేయగా, 20వతేదీ ఉదయం రంగనాథస్వామి పెన్నా పుష్కరిణిలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి తిరుమంజనం, శ్రీ సుదర్శన చక్రస్నాన మహోత్సవం, రాత్రి స్వామి వారికి పుష్పయాగం, ఏకాంత సేవలు నేత్రపర్వంగా జరిగాయి. ఉభయకర్తలుగా విరుపావఝుల గిరికృష్ణ, సంయుక్త, పుష్పయాగం ధ్వజావరోహణానికి ఉభయకర్తలుగా సన్నపురెడ్డి పెదవెంకటరెడ్డి కుటుంబీకులు వ్యవహరించారు. ప్రతిరోజు సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

### కె.వి.నాగేశ్వరరావుకు...

## మానస సాహిత్య అకాడమీ సత్కారం



విజయవాడలో మానస సాహిత్య సాంస్కృతిక అకాడమీ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కవితల పోటీల్లో నెల్లూరుజిల్లాకు చెందిన కవి కె.వి.నాగేశ్వరరావు రచించిన "శవాలజాతర" కవిత ఉత్తమ కవితగా ఎంపికైంది. ఈ నెల 20న విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ జర్నలిస్ట్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మెన్ పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు చేతుల మీదుగా కె.వి.నాగేశ్వరరావుకు 'మధుర కవి' బిరుదు ప్రదానం చేసారు. జ్ఞాపిక, ప్రశంసాపత్రం, నగదుతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆకాశవాణి విజయవాడ కేంద్రం ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ కె.శారద, మానస సంస్థ అధ్యక్షులు బ్రహ్మానందరావు, సినీ హాస్యనటులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు. రెవెన్యూ ఉద్యోగిగా పనిచేస్తున్న కె.వి.నాగేశ్వరరావు ఈ సంవత్సరమే వివిధ సాహితీ సంస్థల నుండి 4జాతీయ అవార్డులు పొంది వుండడం విశేషం. ఈ సందర్భంగా ఆయనకు 'లాయర్' శుభాభినందనలు.

## ఏప్రిల్ 28 నుండి మే1 వరకు ఆంధ్ర మహాభారత ఉపన్యాసములు

నెల్లూరు పురమందిరంలో ఈనెల 28 నుండి మే 1వతేదీ వరకు పద్యకళా పరిషత్ ఆధ్వర్యంలో ఆంధ్ర మహాభారత ఉపన్యాసములు వుంటాయని అధ్యక్షులు యం.రామచంద్రప్రసాద్ తెలిపారు. 28న త్వరకవి వెంకట బాలకృష్ణమూర్తి అధ్యక్షతన స్త్రీపర్వము-ప్రథమాశ్వాసముపై ఆచార్య కప్పరగిరిజాలక్ష్మి, 29న ఎస్సార్కె స్కూలు కరస్పాండెంట్ పి.కృష్ణమూర్తి అధ్యక్షతన స్త్రీపర్వము ద్వితీయాశ్వాసములుపై ఆచార్య కప్పరగిరిజాలక్ష్మి, 30న వి.ఆర్.కళాశాల ప్రిన్సిపాల్ డా॥సి.వి.యస్.భాస్కర్ అధ్యక్షతన విజయవాడకు చెందిన యల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి శాంతిపర్వము-ప్రథమాశ్వాసముపై, మే 1వతేదీన విక్రమసింహపురి విశ్వవిద్యాలయము ప్రిన్సిపాల్ ఆచార్య కె.మురుగయ్య అధ్యక్షతన యల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి శాంతిపర్వము ద్వితీయాశ్వాసముపై ప్రసంగిస్తారని తెలిపారు. ప్రతిరోజు సభా ప్రారంభానికి ముందు సుప్రసిద్ధ రంఘస్థల కళాకారులచే పద్యపఠనముంటుందని తెలిపారు.

## రాశి - మీ వాసి



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

తేది. 25.04.2014 నుండి తేది. 01.05.2014 వరకు

ఈ వారం మేషంలో రవిబుధులుకేతువు, మిథునంలో గురువు, కన్యలో కుజుడు, తులలో శనిరాహువులు, మీనంలో శుక్రుడు, కుంభమీనమేష వృషభాలలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగము:

ముహుర్తము: ముహుర్తములు లేవు.

మే నెల 1వతేదీ ప్రపంచ కార్మిక దినోత్సవము

చైత్ర మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 25 | శుక్ర | ఏకాదశి | సా॥గం.5.24ని॥ |
| తేది. 26 | శని | ద్వాదశి | సా॥గం.3.24ని॥ |
| తేది. 27 | ఆది | త్రయోదశి | ప॥గం.1.41ని॥ |
| తేది. 28 | సోమ | చతుర్దశి | ప॥గం.12.20ని॥ |
| తేది. 29 | మంగళ | అమావాస్య | ప॥గం.11.26ని॥ |

వైశాఖ మాస శుక్ల పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 30 | బుధ | పాడ్యమి | ఉ॥గం.10.56ని॥ |
| తేది. 01 | గురు | విదియ | ఉ॥గం.10.59ని॥ |

### మేషం



అశ్విని, భరణి, కృతిక 1 పాదము

వృత్తి వ్యాపారాలలో ఆటంకాలు చికాకులుండినా అధిగమిస్తారు. క్రొత్త వ్యాపారాలు, కొత్త పెట్టుబడులకు తొందరపడవద్దు. ఆదాయం ఆశించినంతగా ఉండదు. వ్యవహారాలు, పనులు అనుకున్న విధంగా సాగవు. అందుకని టెన్షన్ పడుతుంటారు. ఆరోగ్యం, ఆహార విషయాలలో జాగ్రత్త వహించండి. మీ కుటుంబసభ్యుల మద్దతు మీకు పూర్తిగా ఉంటుంది.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్శ1,2పాదాలు

వ్యాపార చిక్కులను ఇబ్బందులను అధిగమిస్తారు. క్రొత్త పెట్టుబడులు, క్రొత్త వ్యాపారాలు ప్రస్తుతం ఆపుకొనడం మంచిది. ఆదాయం సంతృప్తికరంగా ఉండినా ఖర్చుల వత్తిడి పెరుగుతుంది. బంధుముఖ్యుల అనారోగ్య వార్తలు వింటారు. కోర్టు వ్యవహారాలు వాయిదాపడతాయి. యజమానులకు వర్కర్లతోను, అధికారులు తమ క్రింది ఉద్యోగులతోనూ సమస్యలు ఎదుర్కొంటారు.

### మిధునం



మృగశిర్శ 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆర్థిక విషయాలలో అంచనాలు ఫలించగలవు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. అప్పగించిన పనులను సమర్ధవంతంగా నిర్వహిస్తారు. మీ సూచనలు, సలహాలను ఇతరులు ఆమోదిస్తారు. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, స్థిరాస్తుల లావాదేవీలందు నిర్ణయాలు జరుగుతాయి. శుభకార్యాలలో పాల్గొనడం, విలువైన వస్తువులు కొనడం జరుగుతుంది.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది. ఏదో ఒక రూపంలో ఖర్చులు పెరిగినా ఆర్థికంగా ఇబ్బంది ఉండదు. సోదరవర్గానికి మంచి జరుగుతుంది. ఇచ్చిన మాట, చేస్తానన్న సహాయం నిలబెట్టుకుంటారు. వ్యాపార భాగస్వామ్య అవకాశాలు, కొత్త పెట్టుబడి అవకాశాలు దొరుకుతాయి. విలువైన వస్తువులు, గృహోపకరణాలు కొంటారు.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వ్యాపారవర్గాలకు ఇతరుల నుండి పోటీ ఎక్కువగా ఉంటుంది, అయినా ధైర్యంతో ముందుకు సాగుతారు. చర్చలు సంప్రదింపులలో పాల్గొంటారు. అదనంగా ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. ఆర్థిక లావాదేవీలు సమర్ధవంతంగా నిర్వహిస్తారు. దూరం నుండి ఆహ్వానాలు అందుకొనడం, దూరప్రయాణాలు జరపడం జరుగుతుంది. శుభకార్యాలలో ముందుండి నిర్వహిస్తారు. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలు దొరకగలవు.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆశించిన విధంగా ఆర్థిక పరిస్థితులుండవు. వ్యాపార అవకాశాలు చేజారిపోవచ్చును. ఆర్థిక ఇబ్బందులను అధిగమించే ప్రయత్నాలుంటాయి. ఋణాలు చేయవలసి వస్తుంది. పనులు అనుకున్నంత వేగంగా జరుగవు. కోర్టు వ్యవహారాలు వాయిదాపడటం, రావలసిన వసూళ్ల ఆలస్యంకావడం జరుగుతుంది. ముఖ్య బంధువర్గంలో నుండి అనారోగ్య వార్తలు వింటారు.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థిక ఇబ్బందులు వల్ల సమస్యలోపడతారు. అదుపులేని ఖర్చులు తప్పవు. అనుకున్న పనులు సరిగా జరగక టెన్షన్ పడుతుంటారు. ఇబ్బందుల నుండి గట్టెక్కడానికి మార్గాలుతోచవు. కుటుంబంలో కొద్దిపాటి విభేదాలుంటాయి. ఇతరుల వల్ల మాటలు పడవలసి వచ్చును. రావలసిన బాకీలు వాయిదాపడతాయి. శుభకార్యాలలో పాల్గొంటారు.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కొన్ని ముఖ్య పనులు, కార్యక్రమాలు వాయిదాపడవచ్చును. వృత్తి వ్యాపారాలలో ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. వాణిజ్య అవకాశాలు, ఆర్థికపరమైన సహకారం పొందుతారు. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కావచ్చును. కోర్టు వ్యవహారాలు వాయిదాపడతాయి. క్రయవిక్రయాలలో తొందరవద్దు. అనుకున్న పనులు పట్టుదలతో సాధిస్తారు.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

అనుకున్న పనులు సవ్యంగా జరిగిపోతాయి. వృత్తి వ్యాపారాలలో ఆర్థికావకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తులు కొనే ప్రయత్నాలు జరుగగలవు. కొత్త వ్యాపారాలు, కొత్త పెట్టుబడులు జరుగుతాయి. బిడ్డలకు విద్యా ఉద్యోగ అవకాశాలు లభించగలవు. శుభకార్యాలలో పాల్గొంటారు. శుభకార్య నిర్ణయాలు జరుగగలవు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంది.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తిపరంగా బాగా వ్యాపకం ఉంటుంది. ఆదాయం పెరుగుతుంది. వ్యవహారాలలో ఓర్పు ముందు చూపు ప్రదర్శించండి. నూతన పెట్టుబడులు, వ్యాపార విస్తరణకు అనుకూలత ఉంటుంది. కొన్ని అదనపు ఖర్చులున్నా ఇబ్బందులుండవు. శుభకార్యాలలో పాల్గొంటారు. గృహనిర్మాణాలు రిపేర్లు చేపట్టవచ్చును. స్థిరాస్తులపై ఆదాయముంటుంది.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

అధికారుల వద్దగాని పబ్లిక్‌లోగాని మాటలుపడకుండా అవమానం పొందకుండా జాగ్రత్తపడాలి. వృత్తి జీవనం కలవారికి వృత్తి వ్యాపకం బాగుండి ఆదాయము పెరుగుతుంది. వ్యాపారవర్గాలకు కొత్త వ్యాపారాలు, కొత్త పెట్టుబడి అవకాశాలు దొరుకుతాయి. వ్యాపార ఆదాయం పెరుగుతుంది. కరెంటు పనులు, మెషీన్ల పనులు చేసేవారు జాగ్రత్తగా ఉండాలి.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తి ఉపాధి రంగాల జీవనము కలవారికి ఆదాయం బాగుంటుంది. మరియు ఆ రంగంలో నిలద్రొక్కుకుంటారు. వ్యాపార వర్గాలకు మంచి అభివృద్ధి అవకాశాలుండినా నిర్ణయాలు తీసుకొనలేరు. కాని ఆదాయం బాగుంటుంది. రావలసిన బాకీలు కొంత వసూలు కాగలవు. మాటలు, చేతలలో తొందర తగ్గించుకొనండి. ఆరోగ్యం స్వల్పంగా లోపించుచూ ఇబ్బంది పెడుతుంది.

# పారదర్శకంగా అనిల్ ఎన్నికల ప్రచార ప్రసంగం

నెల్లూరులోని సాదావారిపాళెం, ప్రశాంతినగర్, సింహపురి కాలనీలలో ఈ నెల 22న వైయస్సార్‌సీపీ నెల్లూరు నగర నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 7న జరిగే సాధారణ ఎన్నికల్లో దివంగత మహానేత వై.యస్. కుమారుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి స్థాపించిన వైయస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మీరు వేసే ఓటు రాబోయే 5సంవత్సరాలు రాష్ట్రాన్ని సుభిక్షంగా వుంచేలా రాజన్న సంక్షేమ పథకాలు సక్రమంగా సాగేలా చేస్తాయని తెలిపారు. అలాగే 16వడివిజన్‌లోని గుర్రాలమడుగు, సంగం, ఆదినగర్ ప్రాంతాలలో కూడా అనిల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏ.బాలకోటేశ్వరరావు, కాకుటూరు విజయభాస్కర్‌రెడ్డి, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, సురేష్‌రెడ్డి, గంగపట్నం వినయ్, మురళి, రామ్మూర్తి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రచార సందర్భంగా బొండాలు కాలుస్తున్న డా॥ అనిల్

# ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న పార్టీలు

**- ఎన్నికల నిఘావేదిక రాష్ట్ర కన్వీనర్ లక్ష్మణ్‌రెడ్డి**

నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 22న ఎన్నికల నిఘా వేదిక రాష్ట్ర కన్వీనర్ వి.లక్ష్మణ్‌రెడ్డి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టులు, వ్యాపారాలలో వచ్చిన అక్రమ సంపాదనతో కోట్ల రూపాయలు గడించిన వారే ఎన్నికల్లో ఎక్కువగా పార్టీల అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని పేర్కొన్నారు. వారు ఎన్నికల్లో మద్యం, డబ్బు పంపిణీ చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని అన్నారు. ప్రతి ఓటరు విజ్ఞత కలిగి నిజాయితీగా ప్రలోభాలకు లొంగకుండా ఓటువేయాలని కోరారు. ప్రాంతీయ పార్టీలన్నీ కుటుంబపార్టీలుగా మారిపోయాయని, కులాలు, మతాల వారీగా ప్రజలను విడదీస్తూ లబ్దిపొందాలని చూస్తున్నాయని పేర్కొన్నారు. చట్టసభల్లో చైతన్యవంతులైన విద్యావేత్తలు, మాజీసైనికులు వుండాల్సి వుండగా నేరచరితులు, అక్రమార్కులకే రాజకీయపార్టీలు టిక్కెట్లు ఇస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. నేరచరితులకు ఓటు వేయకూడదనుకున్న ఓటరు నోటా మీట నొక్కి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత వుందని అన్నారు. ఫ్లెక్సీలు, గోడపత్రికల ద్వారా ఓటర్లలో చైతన్యం కలిగించేలా ఎన్నికల నిఘావేదిక కృషి చేస్తుందన్నారు. సమావేశంలో ఫరూఖ్‌అలీ, చలపతి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యునెస్కో కార్యక్రమంలో నెల్లూరు జర్నలిస్ట్



ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ఆగ్రాలోని యూత్ హాస్టల్‌లో ఈనెల 12 నుండి 16వతేదీ వరకు యునెస్కో క్లబ్ అసోసియేషన్ సిల్వర్‌జూబ్లీ శిక్షణా కార్యక్రమం జరిగింది. అందులో పాల్గొన్న నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.జయప్రకాష్ మాట్లాడుతూ ప్రపంచశాంతికి యునెస్కో ఎంతగానో కృషి చేస్తోందని నిరుద్యోగులలో అందరికీ ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించలేదని యువత ప్రైవేటుఉద్యోగాలతో పాటు స్వయం ఉపాధిపై కూడా దృష్టి సారించాలన్నారు. ఉత్తర ప్రదేశ్ పరిసర ప్రాంతాల్లో కుటీర పరిశ్రమలు అభివృద్ధి కావడం వలన ఎక్కువ మందికి ఉపాధి కలుగుతుందన్నారు.

కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాలపై డా॥సంజయ్‌కులశ్రేష్ఠ, ఆగ్రా చరిత్ర గురించి జితేంద్ర రఘువంశీ, తాజ్‌మహల్ నిర్మాణం గురించి దేవ్‌ప్రతాప్‌శర్మ, హిందీభాషలోని సాహిత్య విశిష్టతను ప్రొఫెసర్ నీలంభట్టాచార్యులు వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ పురావస్తుశాఖ అధికారి ఎ.కె.కన్నా, సంస్థ సెక్రటరీ జనరల్ ధీరేంద్ర భట్నాగర్ దేశంలోని వివిధ ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# స్వతంత్ర అభ్యర్థిగా కేతా



నెల్లూరుసిటీ అసెంబ్లీ శాసనసభ్యునిగా కేతా సుబ్బారావు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తూ ఈనెల 19న నామినేషన్ వేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గెలిస్తే శాసనసభ్యునిగా అందుకునే జీతంలో రూ॥ 5వేలు మాత్రమే తీసుకొని మిగిలిన డబ్బు ప్రజాసేవకే ఉపయోగిస్తానన్నారు. అప్పులేని ఆంధ్రప్రదేశ్ కోసం కృషిచేస్తానన్నారు. అవినీతిపై పోరాడతానని నిరుద్యోగ సమస్యపై అసెంబ్లీలో మంత్రులను నిలదీస్తానని తెలిపారు. ఏ పార్టీలో చేరనని, మద్య నిషేధం కోసం పోరాటం చేస్తానని అన్నారు.

# ఆరోగ్యం మనహక్కు



బుజబుజనెల్లూరులోని శ్రీనివాస ఇంగ్లీషు మీడియం స్కూలు ప్రాంగణంలో ఈ నెల 19న పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో "ఆరోగ్యం మనహక్కు - ప్రజలందరికీ వైద్యం ప్రభుత్వాలదే బాధ్యత" అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. సంస్థ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న వాస్తు రామచంద్ర మాట్లాడుతూ ప్రజలందరికీ వైద్యం అందించడంలో ప్రభుత్వాలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించక ప్రక్కకు తప్పుకొని వైద్యాన్ని వ్యాపారంగా మార్చడంతో ప్రజలు జీవించే హక్కు ప్రమాదంలో పడిందని పేర్కొన్నారు. 80శాతం మంది ప్రజలు విధిలేని పరిస్థితుల్లోనే ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి ప్రతి సంవత్సరం అప్పుల పాలవుతున్నారన్నారు.

కార్యక్రమంలో ఎస్‌వీఆర్ స్కూలు కరస్పాండెంట్ అందె శ్రీనివాసులు, పంచాగ్నుల విశ్వేశ్వరశర్మ, సంస్థ ఉపాధ్యక్షుడు రవిగోగులపల్లి, కోశాధికారి ఎస్.ప్రభాకర్‌రాజు, సభ్యులు కిరణ్‌కుమార్, గ్రామప్రజలు పాల్గొన్నారు.

# ‘శోభ’ను కోల్పోయిన కర్నూలు

**విధి చాలా విచిత్రమైంది. ఎప్పుడు ఎవరి జీవితాలతో ఆడుకుంటుందో అర్థమేకాదు. ఇంకో పదిరోజుల్లో ఆమె శాసనసభ్యురాలిగా గెలవబోతుంది. మరో 20రోజుల్లోపు రాష్ట్ర మంత్రి కూడా అయ్యే అవకాశముంది. తన కష్టంతో ఆమె ఉన్నతమైన భవిష్యత్ వైపు అడుగులు వేస్తుంటే, పగబట్టిన కాలం ఆమెను కాటేసి అనంతలోకాలకు తీసుకెళ్లిపోయింది.**



విషణ్ణవదనంలో విజయమ్మ

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో కీలక నాయకురాలు, ఆళ్లగడ్డ శాసనసభ్యురాలు, ప్రస్తుత వైకాపా అభ్యర్థి శ్రీమతి భూమా శోభానాగిరెడ్డి ఈనెల 24వతేదీ ఉదయం 11.05గంటలకు ఈ లోకాన్ని వీడి దైవసన్నిధి చేరారు. 23వ తేదీ ఆళ్లగడ్డ సమీపంలోని దీవగుంట గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆమెను మొదట నంద్యాల ఆసుపత్రిలో చేర్చారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం ఆమె మరణించారు. 23వ తేదీ రాత్రి నంద్యాలలో షర్మిలతో పాటూ ‘జనభేరి’ సభలో పాల్గొన్న ఆమె తన కారులో తిరిగి వస్తుండగా, ఆళ్లగడ్డకు 2కిలోమీటర్ల దూరంలో రోడ్డుపై గడ్డి ఉండడం చూసి డ్రైవర్ సడెన్ బ్రేకు వేసాడు. దీంతో ఆమె ప్రయాణిస్తున్న కారు పల్టీలు కొట్టింది. సీటు బెల్టు ధరించని ఆమె కారులో నుండి బయటకు ఎగిరిపడి తిరిగి కారుపైనే పడడంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే ఆమె కోమాలోకి వెళ్లిపోయారు.

కర్నూలు జిల్లాలో పేరుమోసిన రాజకీయ కుటుంబం ఆమెది. మాజీమంత్రి ఎస్.వి.సుబ్బారెడ్డి కూతురు. 1968 నవంబర్ 16న జన్మించారు. 1986లో భూమా నాగిరెడ్డిని వివాహం చేసుకున్నారు. 1996లో భర్త ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చారు. 1997లో ఆళ్లగడ్డ అసెంబ్లీకి జరిగిన ఉపఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిగా విజయం సాధించారు. 1999 ఎన్నికల్లోనూ తిరిగి ఆళ్లగడ్డ నుండి ఆమె ఎన్నికయ్యారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఏపిఎస్ ఆర్టీసీ రాష్ట్ర ఛైర్మన్‌గా సేవలందించారు. 2009లో ప్రజారాజ్యంలో చేరిన శోభ నాగిరెడ్డి ఆ పార్టీ అభ్యర్థిగా ఆళ్లగడ్డ నుండి గెలిచారు. ఆ తర్వాత వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. 2012లో ఆళ్లగడ్డకు జరిగిన ఉపఎన్నికల్లో వైకాపా అభ్యర్థిగా విజయం సాధించారు. ఇప్పుడు మరో విజయానికి ఉత్సాహంగా ఉరకలేస్తున్న ఆమెను విధి రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. ఆమె మృతికి ‘లాయర్’ సంతాపం ప్రకటిస్తోంది.

# ప్రేతాత్మను బంధిస్తారా?

***ఆయన ఎప్పుడూ మౌనంగా వుంటాడు. చాలా తక్కువగా మాట్లాడతాడు. తాను చాలా అమాయకుడిననే బిల్డప్ ఇస్తాడు. కానీ ఆయన అసాధ్యుడు. తన మౌనం వెనుక కోట్ల కుంభకోణాలకు స్కెచ్‌ని రచించగలిగిన మాడరన్ మాంత్రికుడు. ఎవరికి “చెక్” ఇవ్వాలో ఎవరికి “షేక్” పెట్టాలో బాగా తెలిసిన నేటితరం రాజకీయ చాణుక్యుడు. ఆయనే కెవిపి రామచంద్రరావు.***

దివంగత మహానేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డికి తోడుగా ఆయన వెన్నంటి నడిచే నీడగా డా॥ వై.యస్. పాలనలో కర్ర పెత్తనం చేసిన కెవిపి ఆయన ఆకస్మిక మరణం అనంతరం వై.యస్. కుటుంబానికి దూరమైపోయాడు. వై.యస్. హత్యను పరోక్షంగా ప్రోత్సహించిన కాంగ్రెస్‌కు దగ్గరయ్యాడు, వారి అండతో మళ్ళీ రాజ్యసభ సభ్యుడయ్యాడు. ఇదంతా ఆయన తెలియక చేసింది కాదు. అమాయకత్వంతో వేసిన అడుగులు కావు. అంతా పథకం ప్రకారమే. వై.యస్.కుటుంబంపై కక్షగట్టిన కాంగ్రెస్ అతిష్టానం తననెక్కడ ఇరికిస్తుందోనన్న భయంతో వారి పంచన చేరి పంచే సర్దుకున్నాడు.

చావైనా రేవైనా వై.యస్. కుటుంబంతోనే అని చెప్పాల్సిన మొట్టమొదటి వ్యక్తిగా కెవిపిని అందరూ భావించారు. కాని నమ్మకద్రోహానికి నిలువెత్తు సాక్షిగా మిత్రద్రోహానికి నిజమైన నిదర్శనంగా, రాజకీయ స్వార్థానికి నిఖార్సైన ప్రతిరూపంగా కెవిపి అనబడే ఈ “క్యాప్టన్” తనను తాను రుజువుచేసుకున్నాడు. అన్ని కేసుల నుండీ తాను తప్పించుకున్నానని చంకలు గుద్దుకున్నాడు. కానీ ‘టైటానియం’ రూపంలో ఇప్పుడు ఆయన పాపం పండింది. రాష్ట్రస్థాయి నుండి దేశ స్థాయి వరకు వై.యస్. జగన్మోహన్‌రెడ్డి అనేక అక్రమ సంపాదనలకు పాల్పడ్డాడనే నెపంతో ఆయనను జైలుపాలు చేసిన పార్టీకి గులాంగా మారిన పాపానికి అంతర్జాతీయ స్థాయిలో జరిగిన అతిపెద్ద కుంభకోణంలో కెవిపి ఇరుక్కున్నాడు. కాంగ్రెస్ అండతో తాను చేసిన అనేక అక్రమాల నుండి ఆయన దేశ స్థాయిలో తప్పించుకున్నా ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో ఏకంగా ప్రపంచ అగ్రరాజ్యం అమెరికా చేతిలో చిక్కి పీకల్లోతు కూరుకుపోయాడు. ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్‌వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) అమెరికాలో చాలా శక్తివంతమైన ప్రభుత్వ వ్యవస్థ. ఎఫ్‌బిఐ చేపట్టే ఏ దర్యాప్తునూ ఆషామాషీగా తీసుకోడానికి లేదు. వస్తున్న సమాచారంకి అనుగుణంగా “టైటానియం” కుంభకోణంలో కెవిపిని అరెస్టు చేయడం జరిగితే ఇక ఇప్పట్లో ఆయన బయటకు రావడం కల్లే.

చేసుకున్న వారికి చేసుకున్నంత గణనాథా…అన్నట్లు కనీసం యం.పి.టి.సి స్థాయిలో కూడా గెలవలేని వ్యక్తిని కేవలం స్నేహితుడన్న ఒకేఒక కారణంతో తన సామ్రాజ్యంలో తిరుగులేని వ్యక్తిగా వై.యస్. తీర్చిదిద్దితే నేడు ఆయన కుటుంబానికి వ్యతిరేకంగా “ఢిల్లీ” బెల్లీలతో చేతులు కలిపినందుకు ఆ వై.యస్.ఆత్మే ఈ ప్రేతాత్మకు తగిన బుద్ధి చెబుతోందని వై.యస్. కుటుంబ అభిమానులు గుసగుసలు… కాదు… కాదు, బహిరంగంగానే అనుకుంటున్నారు.

# సీమాంధ్ర అభివృద్ధే ధ్యేయం

**- వెంకయ్య**



సీమాంధ్రను అభివృద్ధి బాటలో నడిపించగలిగే నాయకుడు మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడేనని భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత వెంకయ్య నాయుడు అన్నారు. ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం శ్రీకాళహస్తి పట్టణానికి విచ్చేశారు. పట్టణంలో రోడ్‌షో నిర్వహించారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, బిజెపి తిరుపతి పార్లమెంటు అభ్యర్థి జయరామ ఇతర నాయకులతో కలసి బేరివారి మండపం వద్దకు భారీ ర్యాలీతో విచ్చేశారు. పట్టణమంతా పసుపు, కాషాయం జెండాలతో నిండిపోయాయి. వెంకయ్యపై అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పూలవర్షం కురిపించారు. పట్టణంలోని పంచాయితీరాజ్ అతిథిగృహం సమీపం నుంచి రామసేతు వంతెన, సమాచార కేంద్రం, నెహ్రూవీధి, నగరివీధిగుండా బేరివారి మండపం వరకు రోడ్‌షో నిర్వహించారు. వెంకయ్య మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న గాలేరు -నగరి, హంద్రీ - నీవా, సోమశిల - స్వర్ణముఖి వంటి ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. తిరుపతి పార్లమెంటునుంచి పోటీ చేస్తున్న జయరాం, శ్రీకాళహస్తి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న బొజ్జల గోపాలకృష్ణారెడ్డిని గెలిపిస్తే ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యుడు ఎస్సీవీ నాయుడు, శాంతారాం పవార్‌లు టిడిపిలో చేరడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి, మాజీ ట్రస్టుబోర్డు, మున్సిపల్ ఛైర్మన్ శాంతారాం జె.పవార్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆర్.మ్యాగీక్లారా, గరికపాటి రమేష్, కంఠా రమేష్, డాక్టర్ రమణారెడ్డి, బిజెపి పార్టీ ఉపాధ్యక్షురాలు కండ్రిగ ఉమ, మనోహర్‌రెడ్డి, నాగరాజు, రాజా, రమేష్, సోమశేఖర్‌రెడ్డి వెంకయ్యకు ఘనంగా స్వాగతం పలికారు.

# తు ‘ఫ్యాన్’

(మొదటిపేజీ తరువాయి)

వైకాపా అధినేత వై.యస్.జగన్ కేవలం సీమాంధ్రలో పార్టీపైనే దృష్టి పెట్టాడు. తెలంగాణపై ఆశలు వదిలేసుకున్నాడు. పూర్తి స్థాయిలో సమైక్య నినాదం ఎత్తుకున్నాడు. కాని చంద్రబాబు ఆ పని చేయలేకపోయాడు. రెండుచోట్లా పార్టీని నిలబెట్టుకోవాలనే ఉద్దేశ్యంతో రెండుకళ్ళ సిద్ధాంతానికి కట్టుబడి సమన్యాయం పాటందుకున్నాడు. ఇది అటు తెలంగాణ వాళ్ళకు రుచించలేదు, ఇటు సీమాంధ్ర వాళ్ళను ఒప్పించలేదు. సమైక్యవాదుల ఓటు ఇక్కడే చంద్రబాబుకు దూరమై జగన్‌కు చేరువైంది. రాష్ట్ర విభజన అనంతరం కాంగ్రెస్ పతనం మొదలైంది. వైకాపాలో టిక్కెట్లు దొరకవనుకుని లీడర్లంతా తెలుగుదేశం వైపు వెళితే ఎక్కువ శాతం కేడర్ మాత్రం వైయస్సార్ కాంగ్రెస్‌లోకి వెళ్లింది.

రాష్ట్ర విభజనకు ముందే ఈ రెండు ప్రధానపార్టీలకు కులాలు, మతాల పరంగా ఓటు బ్యాంకులు ఏర్పడ్డాయి. వై.యస్. ప్రవేశపెట్టిన ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు ఆ వర్గంవారిపై బలమైన ప్రభావం చూపుతున్నాయి. వై.యస్. హయాంలో కంటే ఎక్కువగా ఇప్పుడు ముస్లిం ఓటర్లు జగన్‌వైపు ఆకర్షితులవుతున్నారు. ఈరోజు వందకు 80మంది ముస్లింల ఓట్లు జగన్‌కేనని చెప్పుకోవచ్చు. ఇక క్రిస్టియన్‌లు చూస్తే ఈ అభిమానం ఇంకా ఎక్కువగా వుంది. జగన్ మా క్రిస్టియన్ అనే భావనతో ఆ వర్గం ఓటర్లు నూటికి 90మంది వైకాపాకు మద్దతుగా వున్నారు. రాజకీయాలలో ఏ నాయకుడికైనా తన కులమో, లేదా మతమో కలిసొస్తుంది. కాని జగన్‌కు ఆ రెండు కలిసొస్తున్నాయి. మత పరంగా క్రైస్తవులు ఆయనను మా వాడంటుంటే, కులపరంగా వచ్చే సరికి రెడ్డి సామాజిక వర్గం ఆయన వెన్నంటి నడుస్తుంది. మొన్నటివరకు ఈ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా నిలిచిన రెడ్లు ఇప్పుడు జగన్ వెన్నంటి నడుస్తున్నారు. కమ్మ సామాజికవర్గం తెలుగుదేశంకు, రెడ్లు వైకాపాకు పోవడంతో ఈ రాష్ట్రంలో మెజార్టీ సంఖ్యాకులైన కాపు ఓట్లపై కాంగ్రెస్ కన్నేసి వారి ఓట్లను కొల్లగొట్టడానికి కాంగ్రెస్‌పార్టీ మెగాస్టార్ చిరంజీవిని ప్రచార సారధిగా నియమించింది. అయితే ఆయన ప్రభావం ఈ ఎన్నికల్లో ఏ మాత్రం పనిచేయడం లేదు. కాపులు స్థానిక రాజకీయ పరిస్థితులను బట్టి తెలుగుదేశంకు లేదంటే వైకాపాకు మద్దతుగా వున్నారు. కృష్ణా, పశ్చిమ, తూర్పుగోదావరి, విశాఖజిల్లాల్లో కమ్మ సామాజిక వర్గానికి ప్రధాన పోటీదారులు కాపులే! ఈ నాలుగు జిల్లాల్లో కాపులు ఎక్కువగా వైకాపా మద్దతు దారులుగానే వున్నారు.

ఇక బి.సి ఓటర్లపై చంద్రబాబు ఆశలు పెంచుకునివున్నాడు. తెలంగాణలో బి.సి సీఎంను ప్రకటించినంతమాత్రాన సీమాంధ్రలో బి.సిలంతా తెలుగుదేశంకే ఓటేస్తారనే గ్యారంటీ లేదు. బిసిలంటే ఒక కులం కాదు, వందకుపైగా కులాలున్నాయి. ఒక్కో గ్రామంలో ఒక్కొక్కరిది ఒక్కో పంథా! బి.సిల ఓట్లన్నింటిని ఏకతాటిపైకి తేవడం కష్టమే! కాబట్టి బి.సిల ఓట్లు గుత్తసొత్తుగా ఒకే పార్టీకి పడతాయనే పరిస్థితి లేదు.

రాష్ట్రంలోని 13జిల్లాల్లో చూస్తే ఏ జిల్లాలో కూడా తెలుగుదేశంకు ఎక్కువసీట్లు వస్తాయనే గ్యారంటీ లేదు. రాయలసీమలోని అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో వైకాపాదే పైచేయిగా ఉంటుంది. చంద్రబాబు సొంతజిల్లా చిత్తూరులోనూ ఇదే పరిస్థితి. నెల్లూరు, ప్రకాశం, కృష్ణ, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాల్లోనూ వైకాపా ఆధిపత్యం కనిపిస్తుంది. పశ్చిమగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో మాత్రమే వైకాపాకు తెలుగుదేశం కొంతవరకు పోటీనిస్తున్నట్లు తెలుస్తుంది.

బయట సంస్థలు నిర్వహించిన సర్వేలలోనే కాదు, చంద్రబాబు సొంతంగా నిర్వహించిన సర్వేలోనూ వైయస్సార్ కాంగ్రెస్‌కు 110సీట్లు తగ్గవేదని తెలిసింది. సీమాంధ్రలో ఫ్యాన్‌గాలిని తగ్గించడానికి, సైకిల్ వేగాన్ని పెంచడానికి చంద్రబాబు ఎన్ని రకాల ప్రయత్నాలు చేయాలో అన్నీ చేసాడు. కాకపోతే అవేవీ ఫలితాలనివ్వడం లేదు. సముద్రంలో పుట్టిన తుఫాన్‌ను అడ్డుకోవడం ఎంత కష్టమో ప్రజాసముద్రంలో పుట్టిన తు‘ఫ్యాన్’ గాలిని అడ్డుకోవడం అంతే కష్టం.

# పవర్ ముద్దు…

(మొదటిపేజీ తరువాయి)

పోయింది. కళ్యాణ్‌రామ్, తారకరత్నలను ఎవరూ పట్టించుకోరు. నందమూరి సినీ గ్లామర్ జూనియర్‌కే వుంది. 2009 ఎన్నికల్లో జూనియర్ ఎన్టీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి తెలుగుదేశంపార్టీకి ప్రచారంచేసి తన ఉపన్యాసాలతో ప్రజలను ఆకట్టుకున్నాడు కూడా! అటువంటి జూనియర్ ఎన్టీఆర్ ఈరోజు చంద్రబాబుకు అక్కరకు రాకుండా పోయాడు. నందమూరి హరికృష్ణ అసెంబ్లీ టిక్కెట్‌ను ఆశించినా ఇవ్వలేదు. తన వియ్యంకుడు బాలకృష్ణకు మాత్రం హిందూపురం టిక్కెట్ ఇచ్చి వ్యత్యాసం చూపాడు. జూనియర్ ఎన్టీఆర్‌ను ప్రచారం చేయమని మాటమాత్రం కూడా కోరలేదు, సరికదా పార్టీ మాది అనుకునే వాళ్లు స్వచ్ఛందంగా వచ్చి ప్రచారం చేయొచ్చునని లోకేష్ వెటకారంగా మాట్లాడాడు. జూనియర్ ఎన్టీఆర్‌ను ప్రచారానికి పిలవకూడదని వీళ్లు ముందే నిర్ణయించేసుకున్నారు. కాని అదే సమయంలో చంద్రబాబు పవర్‌స్టార్ పవన్ కల్యాణ్‌ను కలిసి ప్రచారం చేయాలని కోరడం చిత్రాతిచిత్రంగా వుందని తెలుగు తమ్ముళ్లే ఆశ్చర్యపోతున్నారు.

పవన్‌కల్యాణ్ ఎన్డీఏకు తప్ప ఇంకెవరికీ ప్రచారం చేయ నంటున్నాడు. చంద్రబాబు ఆయన్ను పట్టుకుని ఎందుకు పీకుతున్నాడో అర్థంకాక తెలుగుతమ్ముళ్లు బుర్రలు గోక్కుంటున్నారు.

# హంగ్

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ, ఎంఐఎం, వైయస్సార్ కాంగ్రెస్‌లు తలా కొన్ని సీట్లు చీల్చుకునే అవకాశముంది. దీంతో తెలంగాణలో ఏర్పాటయ్యే కొత్త ప్రభుత్వంలో మిగతా పార్టీలదే కీలక పాత్ర కానుంది. ఏ పార్టీకి పూర్తి మెజార్టీ రాకుంటే తెలుగుదేశం, బీజేపీ, వైయస్సార్ కాంగ్రెస్‌లు తీసుకునే కీలక నిర్ణయంపై కొత్త ప్రభుత్వం ఏర్పాటవుతుంది.



# గూడూరు డివిజన్ వార్తలు

## కాంగ్రెస్, బీజేపీకి ఓటు ద్వారా బుద్ధిచెప్పాలి



రోడ్‌షోలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రక్కన మాజీ మున్సిపల్ ఛైర్మెన్ కోడూరు కల్పలత

రాష్ట్ర విభజనలో అసెంబ్లీ తీర్మానాన్ని పరిగణలోకి తీసుకోవాలని అలాంటిదేమి పట్టించుకోకుండా కేంద్రం ఏకపక్షంగా వ్యవహరించిందని మాజీ ముఖ్యమంత్రి జై సమైక్యాంధ్ర పార్టీ అధ్యక్షుడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గూడూరు టవర్‌క్లాక్ వద్ద సోమవారం రోడ్‌షో నిర్వహించారు. నెల్లూరు త్యాగాలకు పుట్టినిల్లు అని, తెలుగు వారంతా ఒక్కటని శ్రీ పొట్టిశ్రీరాములు చేసిన త్యాగం కీర్తించదగినదని కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర విభజనకు సహకరించిన కాంగ్రెస్, బిజెపికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని కోరారు. తెలుగుదేశంపార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఏ ఎండకు ఆ గొడుగు పట్టే రకమని విమర్శించారు. తండ్రి సమాధి సాక్షిగా లేఖపంపిన ఘనుడు వైకాపా అధ్యక్షుడు జగన్ అని ఆరోపించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ తమ పార్టీ విభజనకు వ్యతిరేకమన్నారు. సమైక్య ఉద్యమంలో తిరుపతి ఎంపి చింతామోహన్ ఏనాడు పాల్గొనలేదన్నారు.

పార్టీ తిరుపతి పార్లమెంటు అభ్యర్థి సుబ్రహ్మణ్యం, గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి దందోలు చక్రధర్ మాజీ మున్సిపల్ ఛైర్మెన్ కోడూరు కల్పలత, కోడూరు మీరారెడ్డి, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

## ఓటరు స్లిప్పులను బీఎల్‌వోలే పంపిణీచేయాలి



విలేకర్లతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసరావు

ఓటరు స్లిప్పులను సంబంధిత బీఎల్‌వోలే ఓటర్లకు పంపిణీచేయాలని ఆర్డీవో శ్రీనివాసరావు తెలిపారు. నాయకులు వద్ద స్లిప్పులను ఇచ్చి పంపిణీచేసినట్లు తెలిస్తే సంబంధిత బీఎల్‌వోలపై కఠినచర్యలు ఉంటాయని స్పష్టంచేశారు. ప్రతి ఓటరుకు ఇంటింటికి తిరిగి స్లిప్పులను పంపిణీచేయాల్సిన బాధ్యత బీఎల్‌వోల పైనే ఉందన్నారు.

నాయకులు ప్రలోభపెడితే వెంటనే కంట్రోల్‌రూంకు సమాచారం ఇవ్వాలన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా బీఎల్‌వోలు విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది ఓటుహక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఈనెల 27వతేదీన సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్‌ను పంపిణీచేయనున్నట్లు ఆర్డీవో శ్రీనివాసరావు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పోస్టల్‌బ్యాలెట్ పొందినవారు వచ్చేనెల 16న ఉదయం 8గంటలలోగా స్వయంగా గానీ, తపాలాద్వారా గానీ కార్యాలయంలో చేరేవిధంగా చూడాలన్నారు.

## రాష్ట్ర విభజనకు సహకరించిన పార్టీలను ఎండగట్టండి




మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్

రాష్ట్ర విభజనకు సహకరించిన పార్టీలను దుయ్యబట్టి పార్టీ విధానాలను ప్రజలను వివరించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రా రాజగోపాల్ అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గాల అభ్యర్థులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో జై సమైక్యాంధ్ర పార్టీతో పొత్తు ఉందని, అందరూ కలసికట్టుగా పనిచేయాలన్నారు. బరిలో ఉన్న పార్టీ అభ్యర్థులు కటికాల వెంకటేశ్వర్లు, యాదగిరి, దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, దందోలు చక్రధర్, నాయకులు శ్రీరాములు, అజయ్‌కుమార్, రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓటును అమ్ముకుంటే అభివృద్ధి శూన్యం

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు నిజాయితీతో ఓటు వేయాలని జయభారత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోవూరు లోక్‌నాథ్ తెలిపారు. గూడూరు పట్టణంలోని టవర్‌క్లాక్ వద్ద సోమవారంనాడు గోడపత్రికలను ఆవిష్కరించారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకులోనై ఓటును అమ్ముకుంటే అభివృద్ధి శూన్యమని తెలిపారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయకుమార్, కస్తూరిబాబు, కుమార్, నారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### సరస్వతి శిశు మందిరం

## పుస్తకాలు పంపిణీ

గూడూరు పూలతోట గిరిజన కాలనీలో ఉన్న సరస్వతీ శిశు మందిరం విద్యార్థులకు డీఆర్‌డబ్ల్యూ కళాశాల సౌజన్యంతో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ సి.ఆర్. రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డా॥శ్యామలమ్మ, భవాని, హేమలత, హెచ్.ఎం.శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన నామినేషన్ల తంతు...

## ఓటరును పట్టుకోవడంలో నాయకులు బిజీ బిజీ



తెలుగుదేశం అభ్యర్థిగా బి.ఆర్.జ్యోత్స్నలత, రెబల్ అభ్యర్థిగా బల్లి దుర్గాప్రసాద్‌ల నామినేషన్లు

ఎమ్మెల్యే ఎన్నికల ప్రక్రియలో తొలి అంకం నామినేషన్ల పర్వం పూర్తైంది. ప్రధాన పార్టీ తెలుగుదేశం పార్టీ నుంచి వైద్యురాలు ఆర్.జ్యోత్స్నలత, కాంగ్రెస్ పార్టీ తరపున పనబాక కృష్ణయ్య, వైకాపా నుంచి పాశం సునీల్‌కుమార్, సీపీఎం తరపున యాదగిరి, జై సమైక్యాంధ్ర నుంచి చక్రధర్, బీఎస్పీ, ఆమ్‌ఆద్మీతోపాటు స్వతంత్రులు నామినేషన్లు వేశారు. తెలుగుదేశం పార్టీలో తిరుగుబాటు, స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉన్న బల్లి దుర్గాప్రసాద్‌రావు తన నామినేషన్‌ను ఉపసంహరించుకోలేదు. దుర్గాప్రసాద్‌రావు నామినేషన్‌ను ఉపసంహరించుకోకపోవడంతో నియోజకవర్గంలో చతుర్ముఖ పోటీ నెలకొననుంది. ఇదిలా వుండగా నియోజకవర్గంలోని 5మండలాలతో పాటుగా, పట్టణంలోని కీలకంగా వ్యవహరిస్తున్న వ్యాపార వేత్తలు, పలుసంఘాల నాయకులు, తటస్థనేతలతో ప్రధాన పార్టీల అభ్యర్థులు జోరు చర్చలు సాగిస్తున్నారు. మండల స్థాయి నాయకులు, గ్రామసర్పంచులు, ఎంపిటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులతో గ్రామాల వారీగా ఓటరు నాడిపై ఆరాతీస్తున్నారు. తెలుగుదేశం పార్టీ కంచుకోటగా ఉన్న గూడూరులో ఎలాగైనా విజయం సాధించాలని వైకాపా, కాంగ్రెస్ పావులు కదుపుతున్నాయి.

## అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

### ఆర్టీవో రాంప్రసాద్

అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండడం ముఖ్యమని నెల్లూరు ఆర్టీవో రాంప్రసాద్ తెలిపారు. గూడూరు పట్టణంలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన వారోత్సవాల ముగింపు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇళ్లల్లో గ్యాస్‌పై వంట చేసుకుని వెళ్తారే తప్ప గ్యాస్ రెగ్యులేటర్ ఆఫ్ చేయరు. అందువల్లే ఇళ్లల్లో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. పొగతాగి ఎక్కడ పడితే అక్కడ నిర్లక్ష్యంగా పక్కనపడేసి వెళాతారు తప్ప, నిప్పు ఆర్పరు. ఈ రెండు కారణాలవల్లే అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయన్నారు. ఇళ్లల్లో దుకాణాల్లో విద్యుత్ షార్టుసర్క్యూట్ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రి వేళల్లో మెయిన్ ఆపేస్తే ప్రమాదాన్ని నివారించవచ్చని చెప్పారు.




సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో శ్రీనివాసులు

అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాపు సెమినార్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో శ్రీనివాసులు, ఏడీఎఫ్‌వో సత్యనారాయణ, తిరుపతయ్య, రోటరీక్లబ్ అధ్యక్షుడు యమూరిశ్యాం యాదవ్, మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్ రంగారావు, జిల్లాలోని కార్యాలయాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### యానాదుల పిల్లలను

## తప్పక బడిలో చేర్చాలి

నెల్లూరుజిల్లా పర్యటనకు వచ్చిన రాజీవ్‌విద్యామిషన్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉషారాణి ఈ నెల 22న నెల్లూరులోని ఆర్వీయం కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాలోని డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తించి మే15 నుంచి జూన్ 15వ తేదీ వరకు చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్‌ల సహకారంతో నెలరోజుల పాటు విద్యా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని, ముఖ్యంగా జిల్లాలోని యానాదుల పిల్లలను తప్పనిసరిగా బడిలో చేర్పించాలని పేర్కొన్నారు. బడులు పునఃప్రారంభం నాటికి ఆర్వీయం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సివిల్ వర్క్స్ పూర్తి చేయాలని, 2013-14 లక్ష్యం పూర్తి చేయడంలో విఫలమైతే కఠినచర్యలుంటాయని హెచ్చరించారు.

సమావేశంలో ఆర్వీయం పిఒ కోదండ రామిరెడ్డి, సిఎంఒ రవిప్రసాద్, జయ రామయ్యనాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

### మహిళల సంక్షేమానికి

## శ్రీకారం చుట్టింది తెదేపానే!



సమావేశంలో మాట్లాడుతున్న తాళ్ళపాక అనూరాధ

తెదేపా రాష్ట్ర ప్రధానకార్యదర్శి తాళ్ళపాక అనూరాధ ఆధ్వర్యంలో ఈ నెల 22న నెల్లూరు మినీ బైపాస్‌లోని పార్టీ కార్యాలయంలో మహిళా సదస్సు జరిగింది. సదస్సులో పాల్గొన్న నెల్లూరు నగర నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబును ముఖ్యమంత్రిగా, నరేంద్ర మోడీని ప్రధానమంత్రిగా చేసేందుకు మహిళా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో మహిళల సంక్షేమానికి శ్రీకారం చుట్టింది తెదేపా అధినేతలు ఎన్టీరామారావు, చంద్రబాబునాయుడులేనని పేర్కొన్నారు.

తాళ్ళపాక అనూరాధ మాట్లాడుతూ మహిళలకు ఆస్తిహక్కుతో పాటు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన ఘనత చంద్రబాబుదేనని, మహిళలు అందుకే తెదేపా అభ్యర్థులను గెలిపించి రాష్ట్ర ప్రగతికి కృషి చేయాలన్నారు. నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో 300పార్లమెంట్ స్థానాలు బీజేపీకి వస్తాయని, రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ గాలి వీస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మాజీమంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి, టీడీపీ నగర అధ్యక్షులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు విజయలక్ష్మి, తెదేపా నాయకులు అంచెలవాణి, నూనె మల్లికార్జునయాదవ్, పద్మజయాదవ్, హరిబాబుయాదవ్, ఆత్మకూరు నియోజకవర్గ తెదేపా అభ్యర్థి కన్నబాబు, మహిళలు పాల్గొన్నారు.

## ఈవిఎం మీట నొక్కు...
# నీదే కావచ్చు 'గోల్డ్' లక్కు
### ఓటర్లకు నెల్లూరు జేసీ బంగారు ఆఫర్



రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని భారీగా పెంచడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు విశేషకృషి చేస్తున్నారు. ఓటర్లను చైతన్యపరుస్తూ, వారిని పోలింగ్‌బూత్‌లకు తీసుకొచ్చే దిశగా ఆకర్షణీయమైన కార్యక్రమాలను చేపడుతున్నారు. జిల్లాలోనూ ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు జిల్లా అధికారయంత్రాంగం వివిధ కార్యక్రమాలు చేపడుతుంది. ముఖ్యంగా జిల్లా జాయింట్ కలెక్టర్ రేఖారాణి ప్రత్యేకశ్రద్ధ పెట్టి పని చేస్తున్నారు. ఓటేసిన వారి కోసం బంగారం లాంటి ఆఫర్‌ను ఆమె ప్రకటించారు. ప్రస్తుతం ఓటింగ్ శాతం తక్కువుగా వున్న కావలి, వెంకటగిరి, నెల్లూరునగరం, రూరల్ నియోజకవర్గాలలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు లాటరీ పద్ధతిలో బంగారాన్ని బహుమతిగా ఇస్తున్నట్లు బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె వెల్లడించారు. ఓటేసిన వారి నెంబర్లను కంప్యూటర్ ద్వారా లాటరీతీసి మొదటి బహుమతి క్రింద 10గ్రాముల బంగారాన్ని, మరో 9మందికి 2గ్రాముల చొప్పున బంగారాన్ని అందజేస్తామన్నారు.

ఓటును అమ్ముకోకుండా నీతిగా ఓటేయడంపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ఈ నెల 27వ తేదీ రాత్రి నెల్లూరు పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ ఆధ్వర్యంలో సంగీత కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ప్రజలందరూ ఈ కార్యక్రమానికి రావచ్చునని, ముందువరస సీట్లు 25వేలు, ప్రముఖులకు 10వేల రూపాయల పాస్‌లు జారీచేసినట్లు చెప్పారు. తమన్‌కు ఒక్క రూపాయి ఇవ్వడం లేదని, ఆయన సేవాభావంతో ఈ కార్యక్రమం చేస్తున్నారని, వచ్చిన డబ్బును ఖర్చులు పోను మిగిలింది కస్తూర్బా కళాక్షేత్రం అభివృద్ధికి కేటాయిస్తామన్నారు.

# అభివృద్ధికి ఓటు... అవినీతిపై వేటు!



బీజేపీ నాయకులకు మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

దేశ గతి స్థితిని మార్చేది నరేంద్ర మోడీ నాయకత్వమేనని, అవినీతి కుంభకోణాల ఊబిలో కూరుకుపోయిన దేశాన్ని రక్షించడానికి మనమంతా నరేంద్ర మోడీకి మద్దతు తెలపాలని బీజేపీ జాతీయ నాయకులు యం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. బుధవారం బీజేపీ, తెలుగుదేశం అభ్యర్థులకు మద్దతుగా నెల్లూరులో జరిగిన రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. విఆర్‌సి సెంటర్ వద్ద ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. అవినీతి అంతమైపోవాలంటే కేంద్రంలో ఎన్డీఏను, రాష్ట్రంలో తెలుగుదేశం, బీజేపీల కూటమిని గెలిపించాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ గెలవడం, మోడీ ప్రధాని కావడం, ఈ దేశ చరిత్ర మారడం ఖాయమన్నారు. నెల్లూరులో విద్యార్థిస్థాయి నాయకుడిగా జీవితాన్ని మొదలుపెట్టి ఈరోజు జాతీయ స్థాయి నాయకుడిగా ఎదిగానంటే అది నెల్లూరు నేల చలవేనన్నారు. గత ఎన్డీఏ ప్రభుత్వంలో జిల్లా నుండి ఒక్క బీజేపీ ప్రతినిధి లేకపోయినా 30మంది కేంద్ర మంత్రులను తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేయించానన్నారు. యూపిఏ ప్రభుత్వంలో జిల్లాలో ఒక్క అభివృద్ధి పని జరిగిన దాఖలాలు లేవన్నారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రానుందని, నెల్లూరు లోక్‌సభ నుండి తెలుగుదేశం అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి లోక్‌సభ నుండి బీజేపీ అభ్యర్థి కారుమంచి జయరాంలను గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే మీ ప్రతినిధులుగా పనిచేసి, వాళ్లు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు రాబడుతారన్నారు. రాష్ట్ర విభజన వల్ల సీమాంధ్రకు రెవెన్యూ లోటు ఏర్పడిందని, రాబోయే ఎన్డీఏ ప్రభుత్వం దానిని భర్తీ చేస్తుందని చెప్పారు. కేంద్రప్రభుత్వం పార్లమెంటులో ఏకపక్షంగా విభజనకు పూనుకుంటే రాజ్యసభలో తాము పోరాడి సీమాంధ్రకు కొంత న్యాయం చేయగలిగామన్నారు. ఎన్డీఏ అధికారంలోకి వస్తే సీమాంధ్రలో ఐఐటి, ట్రిబుల్‌ఐటి, దుగరాజపట్నం, రామాయపట్నం పోర్టుల నిర్మాణం, చెన్నై-విశాఖ కారిడార్‌లను అభివృద్ధి చేయడం, జాతీయ రహదారిని ఆరులైన్లుగా విస్తరించడంతో పాటు సీమాంధ్రకు స్పెషల్ ప్యాకేజీని పదేళ్లకు పొడిగిస్తామన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో సమర్థ నాయకత్వం కోసం మోడీని ప్రధానిగా, చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో సినీనటులు శివాజీ, తిరుపతి ఎంపీ అభ్యర్థి కారుమంచి జయరాం, నెల్లూరురూరల్ అభ్యర్థి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు పి.సురేంద్రరెడ్డి, కాకు విజయలక్ష్మి, మిడతల రమేష్, సి.హెచ్.వరదయ్య, ఎస్.సురేంద్రరెడ్డి, చక్రధారి, డాక్టర్ జడ్.శివప్రసాద్, కిలారి వెంకట స్వామినాయుడు, నూనె మల్లిఖార్జునయాదవ్, ఆనంద్‌రెడ్డి, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

# ఉధృతంగా సాగుతున్న ప్రచారం







ఎన్నికల గడువు సమీపిస్తుంది. మే 7వతేదీ కోసం జిల్లాలో లక్షలాది కళ్లు ఎదురుచూస్తున్నాయి. అధికార యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లలో ఉంది. ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి వారి తంటాలు వారు పడుతుంటే తమ ఓటింగ్ శాతాన్ని పెంచుకోవడానికి ఆయా పార్టీల అభ్యర్థులు తంటాలు పడుతున్నారు. గడువు దగ్గరపడే కొద్ది అభ్యర్థుల గుండెలు లబ్‌డబ్ అని కాకుండా డబ్బు... డబ్బు... అని కొట్టుకుంటున్నాయి. మొన్న మున్సిపల్ ఎన్నికల్లో గాని జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోగాని చాలాచోట్ల ఓటుకు 500రూపాయల లెక్కన పంచారు. పోటీ తీవ్రంగా ఉన్నచోట్ల వెయ్యిరూపాయలు కూడా అలవాటు చేసారు. అన్ని నియోజకవర్గాలలో కూడా మద్యం పంపిణీ ముమ్మరంగా సాగుతుంది. మందుబాబులు తాగి తలకు పోసుకునేంతగా మద్యం ఏరులై పారుతుంది. నాయకులకంటే ప్రజలు బాగా తెలివిమీరారు. ఎవరొచ్చి ఓటడిగినా మా ఓటు మీకేనని నమ్మకంగా చెప్పి పంపుతున్నారు. వాళ్లు చివరకు ఎవరికి ఓటేస్తారో అర్థంకాక అభ్యర్థులు బుర్ర గోక్కుంటున్నారు.

అభ్యర్థులు మాత్రం ప్రచారాన్ని ఉధృత స్థాయిలో నిర్వహిస్తున్నారు. తాము తిరగడమేకాదు భార్యా బిడ్డలను, అమ్మలను, అక్కలను, తమ్ముళ్ళను, తోడల్లుళ్లను కూడా ప్రచారంలో తిప్పేస్తున్నారు. కొందరు అభ్యర్థులు ఎన్నికల ఖర్చులకు డబ్బులు లేవంటూ ప్రజల మధ్యే కన్నీళ్లు కార్చేస్తూ సెంటిమెంట్ సీన్‌లతో రక్తి కట్టిస్తున్నారు. గ్రామాలు, పట్టణాలలోని ద్వితీయ, దృతీయశ్రేణి నాయకులు ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనేది అంచనావేస్తూ జెండాలు మార్చేపనిని జోరుగా సాగిస్తున్నారు. అభ్యర్థులు ఇంటింటి ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. వీలైనంత వరకు స్వయంగా ఓటర్లను కలుస్తున్నారు. కులాలు, మతాల వారీగా ఓట్ల లెక్కలు వేస్తూ వారి ఓట్లను రాబట్టే ప్రయత్నాలకు శ్రీకారం చుడుతున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులే కాదు, చిన్న చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కూడా తాము గెలుస్తున్నామని ఆత్మవిశ్వాసం ప్రకటిస్తున్నారు. జిల్లాలో ఇంతవరకు వైకాపా తరపున జగన్ ప్రచారం నిర్వహించారు. ఆయన ప్రచారం కూడా నాలుగు నియోజకవర్గాలలోనే జరిగింది. మరో విడత ఆయన ప్రచారానికొచ్చే అవకాశముంది. బీజేపీ అగ్రనేత వెంకయ్యనాయుడు నెల్లూరులో రోడ్‌షో నిర్వహించారు. జైసమైక్యాంధ్ర పార్టీ ప్రచారానికి కిరణ్‌కుమార్‌రెడ్డి రావడం జరిగింది. తెలుగుదేశం తరపున లోకేష్ వచ్చి వెళ్లాడు. చంద్రబాబు కూడా వచ్చే అవకాశముంది.

మొత్తానికి ప్రచారం పతాక స్థాయికి చేరింది. అయితే ఈ ప్రచారమంతా ఒకెత్తు... ఎన్నికలకు రెండురోజుల ముందు జరిగే తతంగమంతా మరో ఎత్తు.

# వేమిరెడ్డికి పెద్దరికం...



వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నెల్లూరు పార్లమెంటు పరిశీలకులుగా ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నియమించారు. నెల్లూరుజిల్లాలో ఎన్నో సామాజిక ఆధ్యాత్మిక కార్యక్రమాలకు భూరివిరాళాలనందించి అందరికీ సుపరిచితుడైన వేమిరెడ్డి కొంతకాలం క్రితం చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో వై.యస్.జగన్ సమక్షాన వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలోనూ వేమిరెడ్డి వైకాపా తరపున కీలకంగా వ్యవహరించి పార్టీలోని నాయకులందరినీ సమన్వయపరిచారు. అలాగే నెల్లూరు లోక్‌సభలో అందరినీ సమన్వయపరచి పనిచేయించే బాధ్యతను కూడా ఆయనకే అప్పగించారు. పార్టీలో అందరికీ ఆయనంటే గౌరవం వుంది. ఆయన మాటకు విలువ వుంది. కాబట్టి నెల్లూరు పార్లమెంట్ పెద్దరికాన్ని ఆయన చేతిలో పెట్టారు.

# ప్రజలపై 'ప్రతాప'ం



రాజకీయ నాయకులకు పార్టీలు మార్చడం అంటే చొక్కాలు మార్చినంత సులభంగా ఉంటుంది. అయితే రోజుకో చొక్కా మారిస్తే బాగుంటుంది కాని గంటకో చొక్కా మారిస్తే ఎబ్బెట్టుగా ఉంటుంది. నాయకులు పార్టీ మార్చడంలో మరీ బరితెగిస్తున్నారు. ఒకప్పుడు ఎన్ఎస్‌యూఐ నాయకుడిగా ఉండి ఆ తర్వాత తెలుగుదేశంపార్టీలో చేరిన బాలాజీనగర్‌కు చెందిన కర్తం ప్రతాప్‌రెడ్డి ఆపైన తన గురువు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని వ్యతిరేకించి కాంగ్రెస్‌లో చేరడం జరిగింది. కొంతకాలం వివేకా నాయకత్వంలో పనిచేసిన ఆయన ఏడాదిక్రితం వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరారు. అయితే అక్కడ స్థానిక వైకాపా నాయకులతో సర్దుబాటు కుదరక మళ్ళీ కాంగ్రెస్‌లోకే పోయారు. మొన్న మున్సిపల్ ఎన్నికల్లో కూడా 14వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసారు. ఇంతలోకే ఏమైందో ఏమో మళ్ళీ 24వ తేదీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరాడు. ఈ నాయకులు ఎప్పుడు ఏ పార్టీకి ఓటేయమంటారో అర్థం కాక స్థానిక ప్రజలు బుర్రలు బద్ధలు కొట్టుకుంటున్నారు.






Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.